విలేకరులు కావలెను

పెన్ సత్తా తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాప్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759

RNI:APTEL/2023/87729

పెన్ సత్తా

ప్రశ్నించడం అందిరి హక్కు..

PEN SATTA Telugu Daily



సంపుటి : 4 | సంచిక :186 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | శనివారం 21 నవంబర్ 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool

ప్రభుత్వ ఆసుపత్రుల్లో కార్పొరేట్ వైద్యం!



- రోబోటిక్ సర్జరీల నుంచి అవయవ మార్పిడి వరకు ఆధునిక సేవలు
- రూ.1,011 కోట్లతో భారీ వైద్య ప్రణాళికలు
- విజయవాడలో తొలి రోబోటిక్ సర్జరీ కేంద్రం.. ఐదు నగరాల్లో క్యాన్సర్ కేంద్రాలు
- ఐవీఎఫ్, బోన్‌మారో, అరుదైన వ్యాధుల చికిత్సకు ప్రత్యేక సదుపాయాలు
- విజయవాడలో రూ.45 కోట్లతో రోబోటిక్ సర్జరీ కేంద్రం

అమరావతి

రాష్ట్రంలోని ప్రభుత్వ బోధనా ఆసుపత్రులను అత్యాధునిక వైద్య కేంద్రాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం భారీ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. పేద, మధ్యతరగతి ప్రజలకు ప్రైవేట్ కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా నాణ్యమైన వైద్య సేవలను ప్రభుత్వ రంగంలోనే అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా రోబోటిక్ శస్త్రచికిత్సలు, ఐవీఎఫ్ కేంద్రాలు, బోన్‌మారో మార్పిడి కేంద్రాలు, అవయవ మార్పిడి విభాగాలు, సమగ్ర క్యాన్సర్ చికిత్స కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందించింది. వీటితో పాటు వైద్య విద్య, పరిశోధన, ఐసీయూ సదుపాయాలను బలోపేతం చేసేందుకు మొత్తం వివరాలు 4లో..



యుద్ధాల వేళ భారత్ శాంతి సందేశం!

- సాంస్కృతిక బంధాలే ప్రపంచ శాంతికి భరోసా: ప్రధాని మోదీ
- పురానా ఖిలా వేదికగా తొలి ఎస్‌సీఓ నాగరికతల సంభాషణల వేదిక ప్రారంభం
- సభ్య దేశాల మధ్య సాంస్కృతిక సంబంధాల బలోపేతానికి పిలుపు
- ప్రాచీన గ్రంథాల డిజిటలీకరణకు ఏఐ సాంకేతికత వినియోగించాలని సూచన
- ఉమ్మడి పరిశోధనలు, విశ్వవిద్యాలయాల మధ్య సహకారానికి ప్రతిపాదన
- బౌద్ధ వారసత్వం, సిల్క్ రూట్ ఆధారంగా హెరిటేజ్ సర్క్యూట్ల అభివృద్ధి
- సాంస్కృతిక ఉత్సవాలు, కళాకారుల మార్పిడితో దేశాల మధ్య సాన్నిహిత్యం

ఏపీఎండీసీకి మహర్దశ

- ఎన్ఎండీసీ స్థాయికి తీర్చిదిద్దుతాం!
- సంస్థను అత్యున్నత మైనింగ్ కంపెనీగా అభివృద్ధి చేయాలి
- వచ్చే ఏడాది డిసెంబర్ నాటికి ఐపీఓకు వెళ్లేలా ప్రణాళిక
- 582 ఖనిజ ప్రాంతాల గుర్తింపు.. 209 క్లస్టర్లుగా విభజన
- పెండింగ్ లీజులు, రెన్యువల్స్ పరిష్కారంతో రూ.400 కోట్ల ఆదాయం



అమరావతి

రాష్ట్రంలోని అపారమైన ఖనిజ సంపదను ఆర్థికాభివృద్ధికి కీలక వనరుగా మలచుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ (ఏపీఎండీసీ)ను జాతీయ ఖనిజాభివృద్ధి సంస్థ (ఎన్ఎండీసీ) తరహాలో అత్యున్నత స్థాయి మైనింగ్ సంస్థగా తీర్చిదిద్దాలని స్పష్టం చేశారు. ఖనిజ వనరులను కేవలం ఆదాయార్జనకే పరిమితం చేయకుండా, వాటికి అదనపు విలువ కల్పించి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించారు. అవసరమైన చోట ప్రైవేట్ ఏజెన్సీల సహకారం తీసుకుంటూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఖనిజ అన్వేషణ చేపట్టాలని ఆదేశించారు. గనుల శాఖపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో కొత్త ఖనిజ నిక్షేపాల గుర్తింపు, వాటి సమర్థ వినియోగం, వేలం ప్రక్రియ, ఆదాయార్జన అవకాశాలపై అధికారులతో చర్చించారు. ఏపీఎండీసీని స్టాక్ మార్కెట్‌లో నమోదు చేసేందుకు ఐపీఓకు వెళ్లే ప్రతిపాదనకు ఆమోదం తెలిపారు. వచ్చే ఏడాది డిసెంబర్ నాటికి ఐపీఓ ప్రక్రియ పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. సంస్థ ఈక్విటీ వివరాలు 4లో..

విమానాశ్రయ తరహాలో ఎయిర్ కాన్‌కోర్స్



- విశాఖ రైల్వే స్టేషన్‌కు అంతర్జాతీయ హంగులు!
- రూ.660 కోట్లతో ఆధునికీకరణ పనులు
- 8 నుంచి 14కు పెరగనున్న ప్లాట్‌ఫారాలు
- ఒకేసారి 4 వేల మంది ప్రయాణికులకు వసతి కల్పించే ఎయిర్ కాన్‌కోర్స్
- 2028 డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యం

విశాఖపట్నం

విశాఖపట్నం రైల్వే స్టేషన్ రూపురేఖలు మారనున్నాయి. ప్రయాణికులకు అంతర్జాతీయ ప్రమాణాలతో అత్యాధునిక సౌకర్యాలు కల్పించడంతో పాటు, దేశంలోని అత్యుత్తమ రైల్వే స్టేషన్లలో ఒకటిగా తీర్చిదిద్దేందుకు ఆధునికీకరణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఇందుకోసం చేపట్టిన ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని గతంలో ఉన్న రూ.450 కోట్ల నుంచి రూ.660 కోట్లకు పెంచారు. ప్లాట్‌ఫారాల సంఖ్యను 8 నుంచి 14కు పెంచేందుకు వివరాలు 4లో..



భారత్‌తో వాణిజ్య ఒప్పందాలకు ప్రపంచ దేశాల ఆసక్తి


- మరో 8-9 ద్వైపాక్షిక ఒప్పందాలకు అవకాశం
- భారత్‌లో డిజైన్, పరిశోధన కేంద్రాల ఏర్పాటుపై అమెరికా సంస్థల దృష్టి
- కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్
- తాను ఏ దేశానికి వెళ్లినా భారత్‌తో ఎఫ్‌టీఏ కుదుర్చుకోవాలనే అభ్యర్థనలు వస్తున్నాయి

రైతులకు అండగా కేంద్రం నిలవాలి

- తుఫాన్ల దెబ్బకు విలవిలలాడుతున్న ఉద్యాన రైతులు!
- అదనపు సాయం అందించండి.. కేంద్రానికి చంద్రబాబు లేఖ
- 18 జిల్లాల్లో 29,960 హెక్టార్లలో పంట నష్టం.. 71,576 మంది రైతులకు దెబ్బ
- పునరుద్ధరణకు రూ.96.33 కోట్ల ఆర్థిక సహాయం కోరిన సీఎం

అమరావతి

వరుస తుఫాన్లతో తీవ్రంగా నష్టపోయిన ఉద్యాన పంటల రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం నుంచి అదనపు ఆర్థిక సహాయం కోరింది. అర్నబ్, మురసు తుఫాన్ల ప్రభావంతో దెబ్బతిన్న తోటల పునరుద్ధరణకు వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాల కింద ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కోరారు. ఈ మేరకు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు శుక్రవారం లేఖ రాశారు. తుఫాన్ల కారణంగా రైతులకు జరిగిన వివరాలు 4లో..



ఎవరి ఆకలి తీరడం లేదో దేశానికి తెలుసు!

- మోదీ వ్యాఖ్యలకు రాహుల్ ఘాటు కౌంటర్.. ప్రభుత్వ ఆర్థిక విధానాలపై విమర్శలు
- పారిశ్రామికవేత్తలపై ప్రధాని వ్యాఖ్యలతో రాజకీయ దుమారం
- విమానాశ్రయాలు, ఓడరేవులు కొందరి చేతుల్లోనే: రాహుల్ ఆరోపణ
- నోట్ల రద్దు, జీఎస్టీతో చిన్న వ్యాపారాలకు నష్టం: కాంగ్రెస్ విమర్శ



సీఈసీ, ఈసీ నియామక చట్టంపై లీకాల్ పిటిషన్ తిరస్కరణ!

- ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనమే విచారిస్తుంది: సీజేఐ సూర్యకాంత్
- ప్రశాంత్ భూషణ్ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు నిర్ణయం
- గతంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసిన ద్విసభ్య ధర్మాసనం
- జస్టిస్ దత్తా, జస్టిస్ శర్మ మధ్య భిన్నాభిప్రాయాలు
- సీఈసీ, ఈసీల ఎంపిక కమిటీ కూర్పుపై న్యాయస్థానంలో విచారణ
- న్యాయమూర్తి పదవీ విరమణ చేసినా విచారణకు అడ్డంకి లేదన్న సీజేఐ

పట్టాలెక్కనున్న తొలి స్వదేశీ బుల్లెట్ ట్రైన్!

- 2027 చివర్లో తొలి సర్వీసుకు సన్నాహాలు.. సూరత్--వాపి మధ్య ప్రారంభం
- 2027 మధ్య నాటికి ట్రాక్ ట్రయల్స్ ప్రారంభించే లక్ష్యం
- గంటకు 280 కి.మీ. వేగంతో ప్రయాణం
- BEML, ICF సంయుక్తంగా దీ28 రైలు తయారీ
- 8 కోచ్‌లు.. ఒకేసారి 557 మంది ప్రయాణించే అవకాశం
- ప్రయాణికులకు అత్యాధునిక సౌకర్యాలు
- ముంబయి--అహ్మదాబాద్ మధ్య ప్రయాణ సమయం భారీగా తగ్గింపు



రైతులకు అండగా కేంద్రం నిలవాలి



-మొదటిపేజీ తరువాయి

నష్టాన్ని వివరిస్తూ, ఉద్యాన పంటల పునరుద్ధరణతో పాటు రైతులకు ఆర్థికంగా అండగా నిలవాల్సిన అవసరాన్ని లేఖలో ప్రస్తావించారు.

18 జిల్లాల్లో భారీ పంట నష్టం

ఈ ఏడాది అక్టోబర్ 28, నవంబర్ 2 తేదీల్లో వరుసగా రాష్ట్రాన్ని తాకిన అర్నబ్, మురసు తుఫాన్ల కారణంగా ఉద్యాన రంగానికి తీవ్ర నష్టం వాటిల్లిందని చంద్రబాబు తెలిపారు. రాష్ట్రంలోని 18 జిల్లాల్లో మొత్తం 29,960 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయని వివరించారు. ఈ ప్రకృతి విపత్తుల ప్రభావంతో 71,576 మంది రైతులు నష్టపోయారని పేర్కొన్నారు. పంటలు చేతికొచ్చే సమయంలో తుఫాన్లు విరుచుకుపడటంతో రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

అర్నబ్ తుఫానుతో అరటి రైతులకు భారీ దెబ్బ

అర్నబ్ తుఫాను ప్రభావం రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తీవ్రంగా కనిపించిందని సీఎం వివరించారు. మొత్తం 215 మండలాల్లో 23,211 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయని తెలిపారు. ముఖ్యంగా అరటి సాగుకు భారీ నష్టం వాటిల్లిందని, ఒక్క అరటి పంటే 15,549 హెక్టార్లలో దెబ్బతిన్నట్లు వెల్లడించారు. ఈదురుగాలులు, భారీ వర్షాల కారణంగా అరటి చెట్లు నేలకొరిగి, పంట దిగుబడితో పాటు రైతుల పెట్టుబడులు కూడా నష్టపోయాయని వివరించారు.

మురసు తుఫానుతో మరోసారి నష్టం

అర్నబ్ తుఫాను నష్టాల నుంచి కోలుకోకముందే మురసు తుఫాను మరోసారి ఉద్యాన రైతులపై ప్రభావం చూపిందని చంద్రబాబు పేర్కొన్నారు. ఈ తుఫాను కారణంగా 108 మండలాల్లో 6,748 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయని తెలిపారు. వరుస ప్రకృతి విపత్తులతో తోటలు దెబ్బతినడం, పంటల ఉత్పత్తి తగ్గడం, రైతులకు ఆదాయం నిలిచిపోవడం వంటి సమస్యలు తలెత్తాయని వివరించారు.

రూ.96.33 కోట్ల అదనపు సాయం కోరిన సీఎం

దెబ్బతిన్న ఉద్యాన తోటలను తిరిగి పునరుద్ధరించేందుకు, రైతులకు అవసరమైన ఆర్థిక చేయూత అందించేందుకు వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాల కింద అదనంగా రూ.96.33 కోట్ల నిధులు మంజూరు చేయాలని చంద్రబాబు కేంద్ర మంత్రిని కోరారు. పంట నష్టంతో ఇబ్బందులు పడుతున్న రైతులు తిరిగి సాగు చేపట్టేందుకు ఈ సహాయం ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఉద్యాన పంటల పునరుద్ధరణ, దెబ్బతిన్న తోటల సంరక్షణ, రైతుల జీవనోపాధి నిలబెట్టేందుకు కేంద్రం సానుకూలంగా స్పందించాలని విజ్ఞప్తి చేశారు.

కొబ్బరి రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి

తుఫాన్ల ప్రభావంతో కొబ్బరి తోటలు కూడా తీవ్రంగా దెబ్బతిన్నాయని ముఖ్యమంత్రి లేఖలో ప్రస్తావించారు. కోనసీమ, కాకినాడ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, బాపట్ల తదితర జిల్లాల్లో గాలుల ధాటికి కొబ్బరి చెట్లు మొవ్వ విరిగి పనికిరాకుండా పోయాయని వివరించారు. ఈ విధంగా దెబ్బతిన్న కొబ్బరి చెట్లను తొలగించడం, కొత్త మొక్కలు నాటడం, తోటలను తిరిగి అభివృద్ధి చేయడం కోసం కొబ్బరి అభివృద్ధి బోర్డు (కోకోసట్ డెవలప్‌మెంట్ బోర్డు) ద్వారా ఆర్థిక సహకారం అందించాలని కోరారు.

రైతులకు అండగా కేంద్రం నిలవాలి

వరుస తుఫాన్లతో నష్టపోయిన ఉద్యాన రైతులకు సకాలంలో సహాయం అందకపోతే భవిష్యత్తులో సాగు కొనసాగించడం కష్టమయ్యే పరిస్థితి ఉందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. తోటల పునరుద్ధరణకు అవసరమైన నిధులు, సాంకేతిక సహకారం అందించడం ద్వారా రైతులు తిరిగి సాధారణ స్థితికి చేరుకునే అవకాశం ఉంటుందని చంద్రబాబు తన లేఖలో వివరించారు. రాష్ట్రంలో ఉద్యాన రంగాన్ని కాపాడటంతో పాటు రైతుల ఆర్థిక భద్రతకు కేంద్ర ప్రభుత్వం తగిన సహకారం అందించాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో కార్పొరేట్ వైద్యం!



-మొదటిపేజీ తరువాయి

రూ.1,011 కోట్ల అంచనా వ్యయంతో ప్రణాళికలు సిద్ధం చేసింది.

ప్రభుత్వ బోధనా ఆసుపత్రుల్లో అత్యాధునిక రోబోటిక్ శస్త్రచికిత్స విధానాన్ని ప్రవేశపెట్టాలని ఆరోగ్య శాఖ నిర్ణయించింది. మొదటి విడతలో విజయవాడలోని ప్రభుత్వ బోధనా ఆసుపత్రిలో రూ.45 కోట్ల వ్యయంతో రోబోటిక్ సర్జరీ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఈ కేంద్రం అందుబాటులోకి వస్తే క్లిష్టమైన శస్త్రచికిత్సలను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్వహించేందుకు అవకాశం ఉంటుంది. తదుపరి దశలో విశాఖపట్నంలోని కింగ్ జార్జ్ ఆసుపత్రి (కేజీహెచ్), కర్నూలు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోనూ ఈ సేవలను విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు.

ఐదు నగరాల్లో ఐవీఎఫ్ కేంద్రాలు

సంతానలేమి సమస్యలతో బాధపడుతున్న దంపతులకు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ఆధునిక చికిత్స అందించేందుకు ఐవీఎఫ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. గుంటూరు, అనంతపురం, విజయనగరం, కాకినాడ, తిరుపతిలోని ప్రభుత్వ బోధనా ఆసుపత్రుల్లో ఈ కేంద్రాలను అందుబాటులోకి తీసుకురావాలని ప్రతిపాదించారు. వీటితో పాటు రాష్ట్రవ్యాప్తంగా బోన్‌మారో మార్పిడి కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ఖరీదైన వైద్య చికిత్సలను పేదలకు అందుబాటులోకి తీసుకురావడంలో ఈ కేంద్రాలు కీలకంగా మారనున్నాయి.

ఐదు నగరాల్లో సమగ్ర క్యాన్సర్ చికిత్స కేంద్రాలు

క్యాన్సర్ బాధితులకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు రాష్ట్రంలో ఐదు సమగ్ర క్యాన్సర్ చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అనంతపురం, మచిలీపట్నం, విజయవాడ, శ్రీకాకుళం, ఒంగోలులో వీటిని ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం సుమారు రూ.500 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేశారు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన ఆర్థిక సహాయం పొందేందుకు కేంద్ర అణుశక్తి శాఖకు ప్రతిపాదనలు సమర్పించాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ అధికారులను ఆదేశించారు. క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తించడం, ఆధునిక పరీక్షలు, చికిత్సా సదుపాయాలను ఒకేచోట అందుబాటులోకి తీసుకురావడంపై దృష్టి సారించనున్నారు.

కిడ్నీ పరిశోధన, అవయవ మార్పిడి కేంద్రాలు

కిడ్నీ సంబంధిత వ్యాధుల చికిత్స, పరిశోధనకు ప్రాధాన్యమిస్తూ రూ.163.52 కోట్లతో ప్రత్యేక కిడ్నీ పరిశోధనా కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు రూపొందించారు. మరోవైపు ప్రభుత్వ బోధనా ఆసుపత్రుల్లో అవయవ మార్పిడి చికిత్సలను అందుబాటులోకి తీసుకురావాలని ఆరోగ్య శాఖ భావిస్తోంది. దీనివల్ల కిడ్నీ తదితర అవయవాల మార్పిడి అవసరమైన రోగులకు ప్రభుత్వ వైద్య వ్యవస్థలోనే మెరుగైన సేవలు అందించే అవకాశం ఉంటుంది.

అరుదైన వ్యాధులకు ప్రత్యేక కేంద్రం

అరుదైన వ్యాధులతో బాధపడుతున్న రోగులకు ప్రత్యేక వైద్య సేవలు అందించేందుకు విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం రూ.17 కోట్లు కేటాయించారు. అరుదైన వ్యాధుల నిర్ధారణ, చికిత్స, నిరంతర వైద్య పర్యవేక్షణకు అవసరమైన సదుపాయాలను ఈ కేంద్రంలో అభివృద్ధి చేయనున్నారు.

మూడు నగరాల్లో బోన్‌మారో ట్రాన్స్‌ప్లాంట్ కేంద్రాలు

బోన్‌మారో మార్పిడి చికిత్సలను ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులోకి తీసుకురావడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. విశాఖపట్నం, గుంటూరు, కర్నూలులోని ప్రభుత్వ బోధనా ఆసుపత్రుల్లో రూ.48 కోట్ల అంచనా వ్యయంతో బోన్‌మారో ట్రాన్స్‌ప్లాంట్ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. రక్త సంబంధిత తీవ్రమైన వ్యాధులతో బాధపడుతున్న వారికి ఈ కేంద్రాలు ఉపయోగపడనున్నాయి.

వైద్య విద్య, ఐసీయూ విభాగాలకు బలోపేతం

వైద్య విద్యా ప్రమాణాలను పెంచడంతో పాటు వైద్య పరిశోధనకు ప్రోత్సాహం అందించేందుకు రూ.180 కోట్లతో స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ పబ్లిక్ హెల్త్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. అదేవిధంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యవసర వైద్య సేవలను మెరుగుపరిచేందుకు రూ.65 కోట్లతో ఐసీయూ విభాగాలను బలోపేతం చేయనున్నారు. అవసరమైన పడకలు, వెంటిలేటర్లు, వైద్య పరికరాలను సమకూర్చడంపై దృష్టి పెట్టనున్నారు.

వైద్య కళాశాలల నిర్మాణాలు వేగవంతం చేయాలి

ఈ ప్రతిపాదనలపై మంగళగిరిలోని ఏపీఐఐసీ ప్రాంగణంలో ఉన్న రాష్ట్ర ఆరోగ్య శాఖ కార్యాలయంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ బోధనా ఆసుపత్రుల్లో వైద్య విద్యార్థులకు అత్యున్నత ప్రమాణాలతో కూడిన శిక్షణ అందించాలని సూచించారు. కొత్తగా మంజూరైన ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. రోగుల అవసరాలకు అనుగుణంగా ఐసీయూ పడకలు, వెంటిలేటర్లను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంచాలని స్పష్టం చేశారు. వైద్య విద్యా కోర్సుల నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ఆధునిక వైద్య పరికరాలను అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు.

రూ.7,369 కోట్ల సాయం కోసం ప్రతిపాదనలు

రాష్ట్రానికి స్టేట్ స్పెసిఫిక్ అసిస్టెన్స్/స్కీమ్ ఫ్రేమ్‌వర్క్ కింద రూ.7,369 కోట్ల ఆర్థిక సహాయం పొందేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు అధికారులు మంత్రికి వివరించారు. ప్రభుత్వ వైద్య రంగాన్ని ఆధునీకరించడంతో పాటు వైద్య విద్య, పరిశోధన, అత్యవసర వైద్య సేవలకు అవసరమైన నిధులను సమీకరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ సమీక్షలో డీహెచ్ఎఫ్‌డబ్ల్యూ, డీపీఎచ్, ఏపీఎంఎస్ఐడీసీకి చెందిన ఉన్నతాధికారులు, చీఫ్ ఇంజినీర్ బలరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శబరిమల యాత్ర - ఏపీ డీజీపీ కార్యాలయానికి కేరళం పోలీసులు కీలక సూచనలు

శబరిమల యాత్రికులకు కేరళం పోలీసులు కీలక సూచనలు చేశారు. మండల-మకరవిళక్కు యాత్ర దృష్ట్యా శబరిమల అయ్యప్ప స్వామి దర్శనానికి వచ్చే భక్తుల రద్దీని నియంత్రించడానికి, ఎలాంటి తొక్కిసలాటలకు తావులేకుండా దర్శనం కల్పించడానికి కేరళం పోలీసులు కొన్ని సూచనలు చేస్తూ వాటిని రాష్ట్ర డీజీపీ కార్యాలయానికి పంపించారు. అయ్యప్ప స్వామి దర్శనానికి వచ్చే ప్రతి భక్తుడు ఆన్‌లైన్ వర్చువల్ క్యూ బుకింగ్ చేసుకోవడం తప్పనిసరి అని స్పష్టం చేశారు. రోజుకు గరిష్టంగా 80 వేల మంది భక్తులను మాత్రమే అనుమతిస్తామని పేర్కొంటూ, యాత్రికులంతా తమ మార్గదర్శకాలను విధిగా పాటించాలని అన్నారు.

శబరిమల దర్శనానికి వచ్చే అయ్యప్ప భక్తులందరూ ముందస్తుగా ఆన్‌లైన్‌లో వర్చువల్ క్యూ బుకింగ్ పూర్తి చేసుకోవాలని కేరళం పోలీసులు తెలిపారు. గతంలో పంబ వద్ద ఉన్న రియల్-టైమ్ స్పాట్ బుకింగ్ కౌంటర్లను ప్రస్తుతం నీలక్కల్‌కు మార్చామన్నారు. స్పాట్ బుకింగ్ అవసరమైన భక్తులు ముందుగా నీలక్కల్ చేరుకుని, ప్రక్రియ పూర్తి చేసుకున్న తర్వాతే పంబకు వెళ్లాలని, నీలక్కల్‌లో రోజుకు గరిష్టంగా 10 వేల మందికి మాత్రమే స్పాట్ బుకింగ్ సదుపాయం ఉంటుందన్నారు.

ఎరుమేలి--పంబ, పండిపెరియార్ సత్రం--పుల్లుమేడు అటవీ మార్గాల ద్వారా నడిచి వచ్చే భక్తుల వద్ద కూడా చెల్లుబాటు అయ్యే ఆన్‌లైన్ లేదా స్పాట్ బుకింగ్ రసీదు ఉండాలని తెలిపారు. అంతేగాక ఈ మార్గాల్లో రోజుకు గరిష్టంగా రెండు వేల మందికి స్పాట్ బుకింగ్ ఏర్పాట్లు చేశారన్నారు. పంబ వద్ద పార్కింగ్ సదుపాయాలు పరిమితంగా ఉన్నందున, ప్రైవేట్ వాహనాల్లో వచ్చే భక్తులు తమ వాహనాలను నీలక్కల్ బేస్ క్యాంప్‌లో పార్క్ చేయాలని, అక్కడి నుంచి కేరళం ఆర్టీసీ చైన్ సర్వీస్ బస్సుల ద్వారా పంబకు చేరుకోవాలన్నారు. కేరళం హైకోర్టు ఆదేశాల మేరకు నీలక్కల్ నుంచి పంబ వరకు రహదారికి ఇరువైపులా వాహనాలను పార్క్ చేయడం పూర్తిగా నిషేధమని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కేరళం పోలీసులు హెచ్చరించారు. 14 మంది ప్రయాణికుల సామర్థ్యం వరకు ఉన్న వాహనాలు భక్తులను పంబ వద్ద దించి, తిరిగి పార్కింగ్ కోసం నీలక్కల్‌కు వచ్చేయాలని 14 సీట్ల కంటే ఎక్కువ సామర్థ్యం ఉన్న ప్రైవేట్ బస్సులు, ఇతర భారీ వాహనాలను పంబ వరకు అనుమతించేది లేదన్నారు. భక్తులు తమ దుస్తులను పంపా నదిలో పదిలివేయడం పూర్తిగా నిషేధమని, పంపా నది పరిశుభ్రతను కాపాడటానికి, పరిసరాల పర్యావరణ పరిరక్షణకు యాత్రికులందరూ పూర్తి సహకారం అందించాలని కోరారు.

ఏపీఎండీసీకి మహర్దశ..

-మొదటిపేజీ తరువాయి

విలువ ఆధారంగా ఐపీఓ ప్రక్రియ చేపట్టాలని సూచించారు. ఈ మేరకు అధికారులు సంబంధిత ప్రతిపాదనలను ముఖ్యమంత్రికి సమర్పించారు.

ఐదేళ్ల కార్యాచరణ ప్రణాళిక

రాష్ట్రంలో ఖనిజ వనరుల అన్వేషణను మరింత వేగవంతం చేయాలని సీఎం సూచించారు. కొత్తగా గుర్తించిన ఖనిజ నిక్షేపాలను సమర్థంగా వినియోగించుకునేందుకు వచ్చే ఐదేళ్లకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని ఆదేశించారు. ఖనిజాల తవ్వకాలు, వేలం ప్రక్రియలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రాష్ట్రంలో లభించే ఖనిజ సంపదకు స్థానికంగానే అదనపు విలువ కల్పించే పరిశ్రమలను ప్రోత్సహించాలని, తద్వారా ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు రాష్ట్రానికి మరింత ఆదాయం సమకూరుతుందని పేర్కొన్నారు.

209 క్లస్టర్లుగా ఖనిజ ప్రాంతాల విభజన

రాష్ట్రవ్యాప్తంగా ఖనిజ నిక్షేపాలను గుర్తించేందుకు ఆధునిక సాంకేతిక పద్ధతులను వినియోగిస్తున్నట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. మొత్తం 74,860 చదరపు కిలోమీటర్ల పరిధిలో 582 మినరల్ పొటెన్షియల్ ఏరియాలను గుర్తించినట్లు తెలిపారు. వీటిని 209 క్లస్టర్లుగా విభజించి ఖనిజ అన్వేషణకు చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. గుర్తించిన ప్రాంతాల్లో ఖనిజాల లభ్యత, నాణ్యత, వాణిజ్యపరమైన అవకాశాలను అంచనా వేసి తదుపరి చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు.

రేర్ ఎర్త్ కార్పొరేషన్ ఏర్పాటుకు ఆమోదం

ఆంధ్రప్రదేశ్ రేర్ ఎర్త్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటుకు చంద్రబాబు ఆమోదం తెలిపారు. అరుదైన ఖనిజాలుగా గుర్తింపు పొందిన రేర్ ఎర్త్ మూలకాల అన్వేషణ, వెలికితీతతో పాటు వాటికి అదనపు విలువ కల్పించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. భవిష్యత్తులో ఎలక్ట్రానిక్స్, ఆధునిక సాంకేతిక పరిశ్రమలు, ఇతర కీలక రంగాల్లో వీటికి పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

పెండింగ్ లీజుల పరిష్కారంతో రూ.400 కోట్ల ఆదాయం

రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న క్వారీ లీజు దరఖాస్తులు, రెన్యువల్స్ అంశంపైనా సమీక్షలో చర్చించారు. ప్రస్తుతం సుమారు 6,500 క్వారీ లీజు దరఖాస్తులు, 223 రెన్యువల్స్ పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు వివరించారు. వీటిని పరిష్కరించేందుకు గడువు పొడిగించే ప్రతిపాదనలను సమీక్షకు తీసుకొచ్చారు. పెండింగ్ దరఖాస్తులు, రెన్యువల్స్ పరిష్కారమైతే ప్రభుత్వానికి సుమారు రూ.400 కోట్ల ఆదాయం వచ్చే అవకాశం ఉందని అంచనా వేశారు. ఈ ప్రక్రియను వేగవంతం చేసి పారదర్శకంగా నిర్ణయాలు తీసుకోవాలని సీఎం సూచించారు.

మూడు బొగ్గు బ్లాకుల వేలంపై దృష్టి

రాష్ట్రంలోని థర్మల్ విద్యుత్ కేంద్రాలకు అవసరమైన బొగ్గు సరఫరాను పటిష్టం చేసేందుకు ఏపీఎండీసీ చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా ఒడిశా, ఝార్ఖండ్ రాష్ట్రాల్లోని మూడు బొగ్గు బ్లాకుల వేలంలో పాల్గొంటున్నట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ మూడు బ్లాకుల్లో కలిపి 1,774.6 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నట్లు తెలిపారు. ఈ బ్లాకులు దక్కించుకోవడం ద్వారా రాష్ట్ర విద్యుత్ అవసరాలకు బొగ్గు సరఫరాను మెరుగుపరచడంతో పాటు ఇంధన భద్రతకు బలం చేకూరుతుందని వివరించారు.

ఖనిజ సంపదే రాష్ట్రాభివృద్ధికి కీలకం

రాష్ట్రంలో విస్తారంగా ఉన్న ఖనిజ వనరులను సమర్థంగా వినియోగించుకోవడం ద్వారా పారిశ్రామికాభివృద్ధికి కొత్త అవకాశాలు సృష్టించాలని చంద్రబాబు స్పష్టం చేశారు. ఏపీఎండీసీని జాతీయ స్థాయిలో పోటీపడగల సంస్థగా తీర్చిదిద్దడంతో పాటు ఖనిజ రంగంలో పెట్టుబడులు, ఆధునిక సాంకేతికత, ఉపాధి అవకాశాలను పెంచేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

విమానాశ్రయ తరహాలో ఎయిర్ కాన్‌కోర్స్

-మొదటిపేజీ తరువాయి



అనుమతులు లభించడంతో రైల్వే బోర్డు స్టేషన్ కాంప్లెక్స్‌కు సంబంధించిన నిర్మాణ నమూనాలను సవరించింది. ఈ విషయాలను విశాఖ ఎంపీ శ్రీ భరత్ వెల్లడించారు. ఈ ఆధునికీకరణ ప్రాజెక్టులో ప్రధాన ఆకర్షణగా 72 మీటర్ల వెడల్పుతో భారీ ఎయిర్ కాన్‌కోర్స్ నిర్మించనున్నారు. స్టేషన్‌కు ఇరువైపులా ఉండే భవనాలను అనుసంధానిస్తూ విమానాశ్రయ టెర్మినల్ తరహాలో దీనిని రూపొందిస్తున్నారు. ఇందులో ఒకేసారి సుమారు 4,000 మంది ప్రయాణికులు ఉండేందుకు వీలుంటుంది. రైళ్ల కోసం వేచి ఉండే ప్రయాణికులకు విశాలమైన స్థలం, మెరుగైన రాకపోకల సదుపాయాలు కల్పించనున్నారు. పెరుగుతున్న ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్మాణాన్ని చేపడుతున్నారు.

14 ప్లాట్‌ఫారాలతో భారీ విస్తరణ

ప్రస్తుతం ఉన్న 8 ప్లాట్‌ఫారాలను 14కు పెంచడంతో స్టేషన్ నిర్వహణ సామర్థ్యం మరింత మెరుగుపడనుంది. ప్లాట్‌ఫారాల విస్తరణకు అనుగుణంగా ప్రధాన స్టేషన్ భవనం, ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, ఇతర నిర్మాణాల సమూనాలను రైల్వే బోర్డు సవరించింది. జ్ఞానాపురం వైపు, ప్లాట్‌ఫారమ్ నంబర్ 1 సమీపంలో నిర్మించనున్న ప్రధాన స్టేషన్ భవనాల డిజైన్లను కూడా మార్చారు. ఈ విస్తరణ పూర్తయితే ప్రయాణికుల రద్దీని సమర్థంగా నిర్వహించేందుకు అవకాశం ఏర్పడుతుంది.

450 కార్లు.. 2 వేల ద్విచక్ర వాహనాలకు పార్కింగ్

స్టేషన్‌కు వచ్చే ప్రయాణికులు, వారిని తీసుకువచ్చే వాహనదారుల కోసం పార్కింగ్ సదుపాయాలను విస్తృతంగా అభివృద్ధి చేస్తున్నారు. ఇందులో భాగంగా 450 కార్లు, 2,000 ద్విచక్ర వాహనాలను నిలిపేందుకు వీలుగా పార్కింగ్ ప్రాంతాలను ఏర్పాటు చేయనున్నారు. ప్రయాణికులు స్టేషన్‌లోకి ప్రవేశించడం, బయటకు వెళ్లడం సులభతరం చేసేలా ప్రత్యేక మార్గాలను కూడా అభివృద్ధి చేస్తున్నారు.

ఫుడ్ కోర్టులు.. ఏసీ లాంజ్‌లు

ప్రయాణికులకు మెరుగైన అనుభూతిని కల్పించేందుకు స్టేషన్ ప్రాంగణంలో ఫుడ్ కోర్టులు, రిటైల్ అవుట్‌లెట్లు, ప్రత్యేక ఏసీ లాంజ్‌లను ఏర్పాటు చేయనున్నారు. ఆధునిక విశ్రాంతి గదులు, ప్రయాణికులకు అవసరమైన ఇతర వాణిజ్య సదుపాయాలను అందుబాటులోకి తీసుకురానున్నారు. మొత్తం 60 ఎకరాల స్టేషన్ ప్రాంగణంలో వర్షపు నీటి సేకరణ వ్యవస్థ, మురుగునీటి శుద్ధి కేంద్రాలను కూడా నిర్మించనున్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయనున్నారు.

రెండు ట్రాక్‌లు నాలుగుకు విస్తరణ

విశాఖ రైల్వే స్టేషన్‌లో రైళ్ల రాకపోకలను మరింత వేగవంతం చేసేందుకు అనుబంధ రైల్వే మార్గాల విస్తరణపైనా దృష్టి పెట్టారు. గోపాలపట్నం నుంచి విశాఖపట్నం పరకు ప్రస్తుతం ఉన్న రెండు ట్రాక్‌ల మార్గాన్ని నాలుగు ట్రాక్‌లుగా విస్తరిస్తున్నారు. దీంతో రైళ్ల రాకపోకలకు ఎదురయ్యే ఇబ్బందులు, ఆలస్యాలను తగ్గించే అవకాశం ఉంటుంది. అదనంగా సింహాచలం మీదుగా వెళ్లే బైపాస్ రైల్వే లైన్ పనులు కూడా వేగంగా కొనసాగుతున్నాయి.

2027 డిసెంబర్‌కు తొలి దశ పూర్తి

ఈ భారీ ప్రాజెక్టును దశలవారీగా పూర్తి చేయాలని రైల్వే శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. మొదటి దశ పనులను వచ్చే ఏడాది డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని నిర్ణయించారు. మొత్తం ఆధునికీకరణ ప్రాజెక్టును 2028 డిసెంబర్ నాటికి అందుబాటులోకి తీసుకురావాలని ప్రణాళిక రూపొందించారు. సవరించిన నిర్మాణ సమూనాలను గురువారం ఆవిష్కరించారు.

పనుల పురోగతిని పరిశీలించిన ఎంపీ

విశాఖ ఎంపీ శ్రీ భరత్ రైల్వే అధికారులతో కలిసి స్టేషన్‌లో జరుగుతున్న ఆధునికీకరణ పనులను పరిశీలించారు. ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లతో సమీక్ష నిర్వహించి పనుల పురోగతి, నిర్మాణాల సమూనాలు, భవిష్యత్ అవసరాలపై చర్చించారు. రైల్వే చీఫ్ ఇంజినీర్ (నిర్మాణ విభాగం) విష్ణుమూర్తి ప్రాజెక్టు వివరాలను ఎంపీకి వివరించారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా మౌలిక సదుపాయాలను విస్తరిస్తున్నామని, నిర్దేశిత గడువులో పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు.

రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ధర్మవరం క్రీడాకారుల ఎంపిక!

ఉమ్మడి అనంతపురం జిల్లా అండర్-17 బాలబాలికల జట్లలో ముగ్గురికి చోటు



ధర్మవరం,నవంబర్ 20 (పెన్ సత్తా) రాష్ట్ర స్థాయి 70వ స్కూల్ గేమ్స్ ఆంధ్రప్రదేశ్ ఇంటర్ డిస్ట్రిక్ట్ అండర్-17 బాస్కెట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి అనంతపురం జిల్లా బాలబాలికల జట్లకు ధర్మవరం పట్టణానికి చెందిన ముగ్గురు క్రీడాకారులు ఎంపికయ్యారు. కర్నూలు నగరంలోని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ క్రీడా మైదానంలో నవంబర్ 21 నుంచి 23వ తేదీ వరకు జరగనున్న రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్లకు బాలికల విభాగంలో ఎం. అలేఖ్య,పి.ప్రియదీప్తి, బాలుర విభాగంలో ఎం. కార్తీక్ నాయక్ ఎంపికయ్యారు.

ఈ నెల 13వ తేదీన అనంతపురం నగరంలోని ఆర్ట్స్ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరిచి వీరు జిల్లా జట్లలో స్థానం సంపాదించారు. ఈ సందర్భంగా ఉమ్మడి అనంతపురం జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అసోసియేట్ సెక్రటరీ, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి మాట్లాడుతూ, ధర్మవరం పట్టణానికి చెందిన ముగ్గురు క్రీడాకారులు జిల్లా జట్లకు ఎంపిక కావడం గర్వకారణమని తెలిపారు.వారి ఎంపిక పట్ల ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు మేడాపురం రామిరెడ్డి, కార్యదర్శి వాయల్పాడు హిదయతుల్లా హర్షం వ్యక్తం చేశారు.రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ క్రీడాకారులు అద్భుత ప్రతిభ కనబరిచి ధర్మవరం పట్టణానికి మంచి పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

పరిటాల శ్రీరామ్‌కు ధర్మవరంలో ఘన స్వాగతం!



- జడ్పీ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం అనంతరం తొలిసారి ధర్మవరానికి రాక.. అడుగడుగునా నీరాజనాలు
- గజమాలలు, బాణసంచా పేలుళ్లతో టీడీపీ శ్రేణుల భారీ స్వాగతం
- పరిటాల రవీంద్ర ఆశయాలే స్ఫూర్తిగా జిల్లా అభివృద్ధికి కృషి చేస్తా: పరిటాల శ్రీరామ్

ధర్మవరం,నవంబర్ 20 (పెన్ సత్తా) శ్రీ సత్యసాయి జిల్లా పరిషత్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం ధర్మవరానికి విచ్చేసిన పరిటాల శ్రీరామ్‌కు తెలుగుదేశం పార్టీ శ్రేణులు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. ఎర్రగుంట సర్కిల్ నుంచి ఆర్టీసీ బస్టాండ్, కాలేజ్ సర్కిల్ మీదుగా ఎన్టీఆర్ సర్కిల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. మార్గమధ్యంలో అడుగడుగునా గజమాలలతో స్వాగతం పలుకుతూ, బాణసంచా కాల్చి తమ అభిమానాన్ని చాటుకున్నారు.పార్టీ కార్యకర్తలు, అభిమానుల ఉత్సాహంతో ధర్మవరం పట్టణంలో సందడి నెలకొంది.

అనంతరం ఎన్టీఆర్ సర్కిల్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి పరిటాల శ్రీరామ్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, గతంలో పరిటాల రవీంద్ర ఏ విధంగా ప్రజల అభివృద్ధికి, పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేశారో,అదే స్ఫూర్తితో తాను కూడా ప్రజాసేవకు అంకితమవుతానని స్పష్టం చేశారు.

జడ్పీ చైర్మన్‌గా తనకు ఈ అవకాశం రావడానికి రాష్ట్ర స్థాయి నాయకులు, జిల్లా నాయకులు, పార్టీ కార్యకర్తలు అందించిన సహాయ సహకారాలే ప్రధాన కారణమని తెలిపారు. ప్రతి ఒక్కరి సమష్టి కృషి,సహకారంతోనే ఈ విజయం సాధ్యమైందని కృతజ్ఞతలు తెలియజేశారు.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తనపై నమ్మకంతో కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటానని పేర్కొన్నారు.శ్రీ సత్యసాయి జిల్లా సమగ్ర అభివృద్ధితో పాటు మండలాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తానన్నారు. రహదారుల నిర్మాణం, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు పల్లెల అభివృద్ధికి నాయకులు, ప్రజాప్రతినిధుల సహకారంతో తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

పరిటాల రవీంద్ర ఆశయాలు,ప్రజాసేవా స్ఫూర్తిని కొనసాగిస్తూ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పనిచేస్తానని పరిటాల శ్రీరామ్ స్పష్టం చేశారు.

జడ్పీ చైర్మన్ పరిటాల శ్రీరామ్‌కు ఘన స్వాగతం!



40వ వార్డు ప్రజలతో కలిసి నూతన జడ్పీ చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలిపిన కౌన్సిలర్ నర్రావుల ఆదినారాయణ

ధర్మవరం,నవంబర్ 20 (పెన్ సత్తా)శ్రీ సత్యసాయి జిల్లా పరిషత్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం ధర్మవరం పట్టణానికి విచ్చేసిన నూతన జడ్పీ చైర్మన్ పరిటాల శ్రీరామ్‌కు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ధర్మవరం పట్టణంలోని 40వ వార్డు తెలుగుదేశం పార్టీ కౌన్సిలర్ నర్రావుల ఆదినారాయణ ఆధ్వర్యంలో వార్డు ప్రజలు కలిసి పరిటాల శ్రీరామ్‌కు ఘన స్వాగతం పలికారు. కౌన్సిలర్ నర్రావుల ఆదినారాయణ పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేయగా, వార్డు ప్రజలు కూడా నూతన జడ్పీ చైర్మన్‌కు అభినందనలు తెలిపారు.జిల్లా పరిషత్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన పరిటాల శ్రీరామ్ నాయకత్వంలో శ్రీ సత్యసాయి జిల్లా మరింత అభివృద్ధి చెందాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో 40వ వార్డు ప్రజలు పాల్గొన్నారు.

తల్లి కోరికే నా "సంకల్పం."



కవిటి (పెన్ సత్తా)నవంబర్ 20:కవిటి మండలం కుసుంపురం గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ అభ్యర్థి అర్జి సుబ్బారావు ప్రచారం ఇప్పుడు గ్రామంలోనే కాదు మండలంలోనే హాట్ టాపిక్ అయింది. "నా సొంత నిధులతో నేను మీకు అందిస్తున్న పథకాలు" అంటూ 9 హామీలతో మేనిఫెస్టో విడుదల చేసి సంచలనం సృష్టించారు.ఈ సందర్భంగా అర్జి సుబ్బారావు తన జీవిత ప్రయాణాన్ని భావోద్వేగంతో వివరించారు.నేను చాలా కష్టాలు పడి పైకి వచ్చాను. నా మొదటి ప్రస్థానం"పిండి మిల్లులో కార్మికుడి"గా ప్రారంభమైంది. ఆ తరువాత చాలా కంపెనీల్లో కార్మికుడిగా పని చేశాను. కాంట్రాక్టర్ల దగ్గర పనికి కుదురుతూ, అంచెలంచెలుగా ఎదుగుతూ, చివరగా స్టీల్ ప్లాంట్లో ఉద్యోగం సంపాదించాను"అని చెప్పారు. కూలి పని చేసి, చెమట చిందించి, కష్టాన్ని నమ్ముకుని ఈ రోజు ఈ స్థాయికి వచ్చానని, అందుకే పేదవాడి కష్టం అంటే ఏమిటో తనకు బాగా తెలుసని అన్నారు. కుసుంపురం పంచాయతీలో ఎవరూ కూడా కష్టం అనే పదాన్ని చూడకూడదు. కనీస అవసరాల కోసం ఎవరూ కష్టాలు పడకూడదు. అదే నా తల్లి "కోరిక". ఆ తల్లి కోరిక నెరవేర్చడానికే, అదే ముఖ్య ఉద్దేశంతోనే నేను ఈ ఎన్నికల్లో నిలబడ్డాను" అని సుబ్బారావు వెల్లడించారు. నా తల్లి ఆశీర్వాదంతో ప్రజల అండతో కుసుంపురాన్ని ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దుతానని తెలిపారు. ఆయన మాటలు విన్న గ్రామ ప్రజలు, మహిళలు, యువత భావోద్వేగానికి గురయ్యారు."మన గ్రామ అభివృద్ధి – మన బాధ్యత" అనే నినాదంతో ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేస్తున్నారు. అర్జి.సుబ్బారావు ఇచ్చిన 9 సంచలన హామీలు...

1.తన సొంత నిధులతో గ్రామ పంచాయతీకి రూ. 5,00,000/- ,2.10వ తరగతి విద్యార్థులకు ప్రతి సంవత్సరం ఎగ్జామ్ స్టేషనరీ, 3.పంచాయతీకి 2 క్రికెట్ కిట్లు ఉ 2 వాలీబాల్ కిట్లు, 4.మన పంచాయతీలో ఆడపిల్ల పెళ్ళికి రూ. 5,000/-
5.మన పంచాయతీలో ఆడపిల్ల పుడితే రూ. 3,000/-, 6.ఎవరైనా మరణిస్తే దహన సంస్కారణకు రూ. 3,000/-, 7.గ్రామంలో ఒక దేవాలయానికి రూ. 25,000/-, 8.గ్రామంలో ఒక చర్చికి రూ. 25,000/-, 9.జిల్లా స్థాయి నుండి ఆపైన గెలిచిన క్రీడాకారులకు నగదు ఉ షీల్డ్ విద్యార్థులు, యువత, క్రీడాకారుల ఎదుగుదలకు కృషి చేస్తానని, రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ, వీధి దీపాలు, పారిశుధ్యం వంటి మౌలిక సౌకర్యాలను మెరుగుపరుస్తానని హామీ ఇచ్చారు.కష్టం తెలిసిన వ్యక్తి, సొంత నిధులతో హామీలు ఇస్తున్న వ్యక్తి అని గ్రామంలో అర్జి సుబ్బారావుకు మంచి స్పందన లభిస్తోంది. తనను ఆశీర్వదించి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. ప్రచారంలో ఆయన వెంట గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో పశువుల పాక దగ్ధం

బాధిత పాడి రైతుకు రూ.12 వేల ఆర్థిక సాయం





కె.కోటపాడు, (పబ్లిక్ వ్యూ) నవంబరు 20: మండలంలోని ఉగ్గినవలస గ్రామంలో గురువారం ఉదయం చోటుచేసుకున్న అగ్నిప్రమాదంలో పాడి రైతు చుక్క రాముకు చెందిన పశువుల పాక పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంతో బాధిత రైతుకు తీవ్ర నష్టం వాటిల్లింది.విషయం తెలుసుకున్న ఆర్.వై. అగ్రహారం గ్రామపంచాయతీ సర్పంచ్ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న యడ్ల రామకృష్ణ మానవతా దృక్పథంతో స్పందించారు. తన వంతు సహాయంగా రూ.12 వేల ఆర్థిక సాయాన్ని బాధిత రైతు చుక్క రాముకు అందజేశారు. సర్పంచ్ అభ్యర్థి యడ్ల అప్పారావు (మాస్టారు), ఆర్.వై. అగ్రహారం గ్రామ పెద్దలు, ఉగ్గినవలస గ్రామస్తుల సమక్షంలో ఈ సహాయాన్ని అందించారు.ఈ సందర్భంగా యడ్ల రామకృష్ణ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం బాధిత రైతుకు గోకులం షెడ్ మంజూరయ్యేలా తన వంతు కృషి చేస్తానని తెలిపారు. గ్రామానికి అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడంతో పాటు గ్రామ సమగ్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆపదలో ఉన్న రైతుకు ఆర్థిక సహాయం అందించిన రామకృష్ణను గ్రామస్తులు అభినందించారు.ం

ఇచ్ఛాపురంలో సందడి.

నూతన జడ్పీటీసీ నీలవేణి దుర్యోధన్ కు శాలువాతో సత్కరించిన నాటక అకాడమీ డైరెక్టర్ కామేశ్వరరావు.



ఇచ్ఛాపురం(పబ్లిక్ వ్యూ) నవంబర్20:ఇచ్ఛాపురం మండల రాజకీయాల్లో నూతన ఉత్సాహం నెలకొంది. జడ్పీటీసీగా బాధ్యతలు చేపట్టిన వెంటనే తిప్పన నీలవేణి దుర్యోధన్ కు అభినందనల వెల్లువ కురుస్తోంది.ఈ నేపథ్యంలో ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్ దక్కత కామేశ్వరరావు నీలవేణి దుర్యోధన్ ను ప్రత్యేకంగా కలిసి ఘనంగా సన్మానించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా కామేశ్వరరావు మాట్లాడుతూ "పదవి అనేది ప్రజలకు సేవ చేసేందుకు వచ్చిన అవకాశం. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, ప్రజాసేవలో ముందుండి మండల అభివృద్ధికి కృషి చేయాలి" అని ఆకాంక్షించారు. మహిళా నాయకత్వంలో ఇచ్ఛాపురం మండలం మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.సన్మానం అందుకున్న నీలవేణి దుర్యోధన్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి అవకాశం ఇచ్చిన ప్రజలకు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారమే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో దాసరి రాజు, కూటమి నేతలు,పాల్గొని నూతన జడ్పీటీసీకి శుభాకాంక్షలు తెలిపారు.

"పాడి రైతుకు కష్టం వస్తే...

హెరిటేజ్ మీ ఇంటికి వస్తుంది!

డెయిరీ మేనేజర్ కూండ్రపు శేషు



అచ్యుతాపురం, (పబ్లిక్ వ్యూ) నవంబర్ 20: పాడి రైతులకు కష్టం వస్తే హెరిటేజ్ డెయిరీ మీ ఇంటికి వస్తుందని మేనేజర్ కూండ్రపు శేషు పేర్కొన్నారు. పాడి రైతుల సంక్షేమమే లక్ష్యంగా హెరిటేజ్ డెయిరీ పలు ప్రోత్సాహకాలు, రాయితీలు అందిస్తోందని డెయిరీ శేషు తెలిపారు. అచ్యుతాపురం మండలం దుప్పితూరు గ్రామానికి శుక్రవారం సందర్శించి రైతు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పాడి రైతు శెట్టి నర్సింగరావు ఆవు ఇటీవల మృతి చెందడంతో ఆయనకు రూ.50 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ సందర్భంగా శేషు మాట్లాడుతూ.. హెరిటేజ్ డెయిరీకి పాలు పోసే ప్రతి పాడి రైతుకు కృత్రిమ గర్భధారణ సేవలను కేవలం రూ.50కే రాయితీపై అందిస్తున్నట్లు వెల్లడించారు. హెరిటేజ్ సభ్యత్వం కలిగిన పాడి రైతు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.2 లక్షల, సహజ మరణానికి 50 వేలు ఆర్థిక సాయం అందిస్తామని తెలిపారు. పాడి రైతులు ఎదుర్కొంటున్న కష్టాలను గుర్తించి, ఆర్థికంగా అండగా నిలవడంతో పాటు పశుపోషణను ప్రోత్సహించేందుకు హెరిటేజ్ డెయిరీ నిరంతరం కృషి చేస్తోందన్నారు.ఈకార్యక్రమంలో పాల సంఘం అధ్యక్షుడు ధూళి నానాజీ, కాసుబాబు, శెట్టి శంకరరావు, చందర్రావు, సన్యాసిరావు, ఈశ్వరరావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ చతికలపడటానికి గల కారణాలివేనా?



స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ చతికలపడిందనే చెప్పాలి. కూటమిలోని మిత్ర పక్షాలైన టీడీపీ, జనసేనలు మంచి స్ట్రయిక్ రేట్ తో విజయం సాధిస్తే బీజేపీ మాత్రం అనుకున్న స్థానాలను దక్కించుకోకపోగా, ఇచ్చిన స్థానాల్లోనూ ఓటమి చెంది రాష్ట్రంలో మా పరిస్థితి ఇక మారదన్న అభిప్రాయాన్నిపంపింది. కొన్ని చోట్ల అభ్యర్థుల ఎంపికతో పాటు పార్టీ నేతల ప్రచారంలో వైఫల్యాలు కూడా ఆ పార్టీ ఓటమికి కారణాలుగా చెబుతున్నారు. సమన్వయం సాధించుకోలేకపోవడం, ఓట్ల బదిలీ విషయంలో సీరియస్ గా ఉండకపోవడం వంటి కారణాలు బీజేపీని స్థానిక సంస్థల ఎన్నికల పదవులకు దూరం చేశాయన్న కామెంట్స్ వినపడుతున్నాయి. కేంద్ర నాయకత్వం కూడా రాష్ట్ర బీజేపీ నేతల పనితీరుపై అసంతృప్తిగా ఉన్నట్లు తెలిసింది. జాతీయ బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబిన్ ఏపీకి వచ్చి స్థానిక సంస్థల ఎన్నికల్లో బలంగా పోటీ చేసి నిలబడి పోరాడి విజయం సాధించి పార్టీని బలోపేతం చేయాలని విశాఖలో సూచించి వెళ్లినా రాష్ట్ర నేతలు ఏమాత్రం పట్టించుకోలేదన్న అభిప్రాయం బీజేపీ నేతల్లో వ్యక్తమవుతుంది.

కూటమి విజయం సాధించినా...

పట్టణ స్థానిక సంస్థలు, పరిషత్ ఎన్నికల్లో కూటమి విజయం సాధించినప్పటికీ, టీడీపీ 59, జనసేన 18 స్థానాలతో పోలిస్తే బీజేపీ కేవలం 4 మున్సిపాలిటీలు, నగర పంచాయతీలను మాత్రమే గెలుచుకుంది.కీలక స్థానాల్లో ఓటమి చెందింది. అనంతపురం కార్పొరేషన్‌లో కూటమికి మెజారిటీ డివిజన్లు వచ్చినప్పటికీ, మేయర్ పదవికి పోటీ చేసిన బీజేపీ అభ్యర్థి వైసీపీ చేతిలో ఓటమి పాలయ్యారు. తిరుపతి కార్పొరేషన్, మంత్రి సత్యకుమార్ ప్రాతినిధ్యం వహిస్తున్న ధర్మవరం, అలాగే అల్లూరి సీతారామరాజు, విజయనగరం జిల్లాల బీజేపీ అధ్యక్షులు పోటీ చేసిన స్థానాల్లో కూడా పార్టీ అభ్యర్థులు పరాజయం పొందారు. దీన్ని బట్టి ఆంధ్రప్రదేశ్ లోని ఏ ప్రాంతంలోనూ బీజేపీ బలోపేతం కాలేదని, ఇక పరిస్థితి మారలేదన్న అభిప్రాయం బీజేపీ క్యాడర్ లోనూ, ద్వితీయ శ్రేణి నేతల్లోనూ వ్యక్తమవుతుంది. కూటమి పార్టీల మధ్య సమన్వయ లోపమే ప్రధాన కారణమని బీజేపీ నేతలు చెబుతున్నారు. , భీమవరం మున్సిపల్ ఎన్నికల్లో "కూటమి ధర్మాన్ని ఉల్లంఘించారని" ఆరోపిస్తూ బీజేపీ తన మిత్రపక్షాలైన టీడీపీ, జనసేనలతో విడిపోయింది.

ఓట్ల బదిలీ జరగకపోవడం...

స్థానిక స్థాయిలో మిత్రపక్షాల మధ్య పూర్తిస్థాయి ఓట్ల బదిలీ మరియు సమన్వయం లేకపోవడం కొన్ని చోట్ల ప్రభావం చూపిందని విశ్లేషకులు భావిస్తున్నారు. గ్రామీణ స్థాయిలో బలహీనమైన క్యాడర్ ఉండటం కూడా ఓటములకు ప్రధాన కారణం. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో టీడీపీ, జనసేనలతో పోలిస్తే బీజేపీ చెప్పుకోదగ్గ విజయాలను సాధించలేకపోయింది. క్షేత్రస్థాయిలో పార్టీ నిర్మాణం బలహీనంగా ఉండటంపై పార్టీ వర్గాల్లోనే అంతర్మథనం మొదలైనట్లు తెలుస్తోంది. యితే బీజేపీ నేతల వివరణ,వాదన మరోలా ఉన్నాయి. ఎన్నికల్లో తమ పార్టీ పూర్తిగా చతికిలపడిందన్న వాదనను బీజేపీ రాష్ట్ర నాయకత్వం తోసిపుచ్చుతోంది.కూటమి ఒప్పందంలో భాగంగా బీజేపీకి కేటాయించిన స్థానాల్లో 59 శాతానికి పైగా సీట్లను గెలుచుకున్నామని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి పేర్కొన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని అనపర్తి , గోపాలపురం , కొవ్వూరు వంటి చోట్ల అత్యధిక స్థానాలు గెలిచామని ఆమె తెలిపారు. పోటీ చేసిన 33 జెడ్పీటీసీ స్థానాల్లో 23 గెలుచుకున్నామని, రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 355 మంది బీజేపీ ప్రతినిధులు ఎన్నికయ్యారని ఆయన వివరించారు. అయితే, క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి కూటమి భాగస్వాముల మధ్య ఇంకా బలమైన సమన్వయం అవసరమని ఆయన అంగీకరించారు.మొత్తంగా చూస్తే, కూటమిలో భాగంగా బీజేపీకి తక్కువ సంఖ్యలో సీట్లు కేటాయించడం, కేటాయించిన కొన్ని కీలక మేయర్ మరియు కౌన్సిలర్ స్థానాల్లో మిత్రపక్షాల ఓట్లు పూర్తిగా బదిలీ కాకపోవడం, మరియు స్థానికంగా బలమైన నాయకత్వం లేకపోవడం వంటి అంశాలు బీజేపీ ఫలితాలపై ప్రభావం చూపాయని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.


కడప రాజకీయాల్లో సంచలనం : జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆది రాజీనామా?



కడప జడ్పీ చైర్మన్ పదవి దక్కకపోవడంతో బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. తన సోదరుడి కుమారుడు రాజేష్ రెడ్డికి ఈ పదవి ఇవ్వాలని కోరినా, కూటమి నేతలు టీడీపీ నేత పుత్తా నరసింహారెడ్డిని ఎంపిక చేయడంతో ఆయన నిరాశకు గురైనట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని యోచిస్తున్నట్లు, ఆయనకు మద్దతుగా కొందరు జడ్పీటీసీలు కూడా రాజీనామాకు సిద్ధమవుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. జడ్పీ చైర్మన్ ప్రమాణస్వీకారానికి హాజరుకాకుండా విజయవాడ వెళ్లిన ఆదినారాయణరెడ్డి తదుపరి నిర్ణయంపై ఉత్కంఠ నెలకొంది. వైఎస్ఆర్ కడప జిల్లా రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. జిల్లా పరిషత్ చైర్మన్ ఎంపికపై జమ్మలమడుగు బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. కడప జడ్పీ చైర్మనుగా మాజీ ఎమ్మెల్సీ పుత్తా నరసింహారెడ్డిని ఎంపిక చేయడం ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డికి నచ్చలేదని చెబుతున్నారు. తన సోదరుడు కుమారుడు రాజేష్ రెడ్డికి ఈ పదవి ఇవ్వాలని ఎమ్మెల్యే కోరినట్లు చెబుతున్నారు. ఆయన ప్రతిపాదనను పరిశీలించలేదన్న ఆవేదనతో తీవ్ర అసంతృప్తికి లోనైనట్లు చెబుతున్నారు. దీంతో పదవికి రాజీనామా చేయాలని ఎమ్మెల్యే నిర్ణయం తీసుకున్నారని చెబుతున్నారు. ఈ కారణంగానే కడపలో జరిగే జడ్పీ చైర్మను ప్రమాణస్వీకారానికి హాజరుకాకుండా హుటాహుటిన విజయవాడ బయలు దేరివచ్చారని చెబుతున్నారు.

కడప జెడ్పీ చైర్మన్ పీఠం చేజారడాన్ని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి జీర్ణించుకోలేకపోతున్నారని చెబుతున్నారు. కడప జిల్లా పరిషత్ చైర్మన్ పదవిని తన సోదరుడి కుమారుడు డాక్టర్ చదిపిరాళ్ల రాజేష్ రెడ్డికి ఇప్పించుకునేందుకు ఆదినారాయణ రెడ్డి చివరి నిమిషం వరకు తీవ్రంగా ప్రయత్నించారు. ఒకానొక దశలో ఈ పదవి విషయంలో ఆయనకు సానుకూల హామీ కూడా లభించినట్లు వార్తలు వినిపించాయి. అయితే, కూటమి నేతల తుది పంపకాల్లో బీజేపీకి కృష్ణా జిల్లా జెడ్పీ పీఠం ఖరారు కాగా, కడప జెడ్పీ చైర్మన్ పదవిని టీడీపీ సీనియర్ నేత పుత్తా నరసింహా రెడ్డికి కేటాయించారు. దీంతో ఆదినారాయణ రెడ్డి వర్గం తీవ్ర నిరాశకు గురైందని అంటున్నారు.జెడ్పీ చైర్మన్ ఎంపికపై అధికారిక ప్రకటన వెలువడిన వెంటనే ఆదినారాయణ రెడ్డి తన ముఖ్య అనుచరులు, మద్దతుదారులతో కలిసి రాత్రికి రాత్రే హుటాహుటిన విజయవాడకు చేరుకున్నారు. అక్కడ తన వర్గీయులతో భవిష్యత్ కార్యాచరణపై కీలక మంత్రాంగం నిర్వహించినట్లు సమాచారం. కేవలం ఎమ్మెల్యే మాత్రమే కాకుండా, ఆయనకు మద్దతుగా జమ్మలమడుగు, ముద్దనూరు, ఎర్రగుంట్ల ప్రాంతాలకు చెందిన జడ్పీటీసీ సభ్యులు కూడా తమ పదవులకు రాజీనామా చేసే ఆలోచనలో ఉన్నట్లు ప్రచారం ఊపందుకుంది.2014లో వైసీపీ నుంచి గెలుపొందిన ఆదినారాయణ రెడ్డి, ఆ తర్వాత టీడీపీలో చేరి మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. తిరిగి 2024 సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా బరిలోకి దిగి జమ్మలమడుగు నుంచి విజయం సాధించారు. జిల్లాలో ముఖ్యంగా పులివెందుల వంటి కీలక ప్రాంతాల్లో స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో వైసీపీని దీటుగా ఎదుర్కోవడంలో ఆయన క్రియాశీలక పాత్ర పోషించారు. అలాంటి నేపథ్యంలో కడప జెడ్పీ పీఠం విషయంలో భంగపాటు ఎదురవడంతో ఆదినారాయణ రెడ్డి మనస్తాపానికి లోనయ్యారని చెబుతున్నారు. దీంతో ఆయన తీసుకోబోయే నిర్ణయంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

160 ఏళ్ల చరిత్ర.. దావూద్ నివసించిన భవనంలో అసలేం ఉంది? ఎందుకు కూల్చివేత ఆగింది?



ముంబైలో దావూద్ ఇబ్రహీం గతంలో నివసించిన 160 ఏళ్ల పురాతన భవనం కూల్చివేతకు బాంబే హైకోర్టు నవంబర్ 25 వరకు స్టే విధించింది. భెండీ బజార్‌లోని పాక్మోడియా వీధిలో ఉన్న ఈ భవనాన్ని ప్రమాదకరంగా ఉందంటూ బీఎంసీ అధికారులు కూల్చివేత ప్రారంభించారు. అయితే, ఇది వక్ఫ్ ట్రస్ట్‌కు చెందిన మతపరమైన ఆస్తి అని, చట్టపరమైన హక్కులను పరిశీలించకుండా కూల్చివేయడం సరికాదని ట్రస్ట్ ప్రతినిధులు కోర్టును ఆశ్రయించారు. దీంతో తదుపరి ఆదేశాలు వచ్చే వరకు భవనాన్ని యథాతథ స్థితిలో ఉంచాలని ధర్మాసనం ఆదేశించింది.ఒకప్పుడు ముంబై అండర్‌వరల్డ్‌ను శాసించిన గ్యాంగ్‌స్టర్ దావూద్ ఇబ్రహీం పేరు వింటేనే ఎన్నో సంచలన కథనాలు కళ్లముందు కదలాడతాయి. అలాంటి దావూద్‌తో ముడిపడి ఉన్న ఓ పురాతన భవనం ఇప్పుడు ముంబైలో మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరిందంటూ మున్సిపల్ అధికారులు కూల్చివేతకు సిద్ధం కాగా.. బాంబే హైకోర్టు తాత్కాలికంగా బ్రేక్ వేసింది. దీంతో అసలు ఆ భవనం వెనుక ఉన్న కథేంటి? కోర్టు ఎందుకు జోక్యం చేసుకుంది? అన్నది ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.అది దక్షిణ ముంబైలోని భెండీ బజార్ ప్రాంతం.. పాక్మోడియా వీధిలో ఉన్న హాజీ ఇస్మాయిల్ హాజీ హబీబ్ ముసాఫిర్‌ఖానా ఇప్పుడు ఈ వివాదానికి కేంద్రబిందువుగా మారింది. 1970వ దశకంలో దావూద్ ఇబ్రహీం తన కుటుంబంతో కలిసి ఇక్కడే నివసించాడు. 1986లో అతడు దేశం విడిచి పారిపోయిన తర్వాత 1993 ముంబై వరుస పేలుళ్ల ఘటనతో ఈ భవనానికి దావూద్ పాత ఇల్లు అనే ముద్ర పడిపోయింది.అయితే ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే.. ప్రస్తుతం ఈ భవనంపై జరుగుతున్న న్యాయపోరాటానికి దావూద్‌కు ఎలాంటి సంబంధం లేదు. ఇందులో ఉన్న 160 ఏళ్ల నాటి మతపరమైన వారసత్వం.. వక్ఫ్ ట్రస్ట్ హక్కులే ఈ వివాదానికి అసలు కారణం..

ఈ భవన నిర్మాణం 1864 నాటిది. హాజీ మియా హాజీ ఇస్మాయిల్ హాజీ హబీబ్ అనే దాత అక్టోబర్ 1864లో దీనిని హజ్ యాత్రికుల విశ్రాంతి గృహంగా.. మసీదు కోసం శాశ్వతంగా అంకితం చేశారు. అందుకు సాక్ష్యంగా భవనంలో అరబిక్.. పర్షియన్ భాషల్లో చెక్కిన పాలరాతి ఫలకాలు ఇప్పటికీ ఉన్నాయని పిటిషనర్లు కోర్టుకు తెలిపారు. అంతేకాకుండా భవనం గ్రౌండ్ ఫ్లోర్‌లో సుమారు 148.79 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఒక మసీదు కూడా ఉంది. బయటి ప్రపంచానికి ఇది దావూద్ నివాసంగా తెలిసినా దీని వెనుక ఎంతో సామాజిక, మతపరమైన చరిత్ర దాగి ఉంది.

ఈ రెండు అంతస్తుల భవనం అత్యంత ప్రమాదకరంగా.. కూలిపోయే స్థితిలో ఉందని బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు గుర్తించారు. ఈ క్రమంలోనే గురువారం ఉదయం కూల్చివేత పనులను ప్రారంభించారు. అధికారులు పనులు మొదలుపెట్టిన కొద్ది గంటల్లోనే ఈ వక్ఫ్ ట్రస్ట్‌కు చెందిన షేక్ అబ్దుల్ రజాక్, అమీరాలీ వజీరాలీ పంజ్‌వానీ బాంబే హైకోర్టును ఆశ్రయించారు. మతపరమైన ఆస్తిని చట్టపరమైన హక్కులు పరిశీలించకుండా ఎలా కూల్చివేస్తారని వారు ప్రశ్నించారు. దీనిపై విచారణ చేపట్టిన ప్రధాన న్యాయమూర్తి మహేష్ చంద్ర త్రిపాఠి, జస్టిస్ అద్వైత్ ఎం. సేథ్నాలతో కూడిన ధర్మాసనం నవంబర్ 25 వరకు కూల్చివేతపై స్టే విధించింది. తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు భవనాన్ని యథాతథ స్థితిలో ఉంచాలని స్పష్టం చేసింది. అప్పటికే భవనంలోని కొంత భాగాన్ని కూల్చివేసిన అధికారులు.. కోర్టు ఉత్తర్వులతో పనులను తక్షణమే నిలిపివేశారు. నవంబర్ 25న జరిగే తదుపరి విచారణలో కోర్టు ఎలాంటి తీర్పు ఇస్తుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

వారసులకు అందలం.. జడ్పీ పీఠాలపై పరిటాల శ్రీరామ్, సిరిసహస్ర, డాటర్ ఆఫ్ చింతమనేని



చిన్నారులపై లైంగిక వేధింపులను అరికట్టే బాధ్యత పూర్తిగా పెద్దలదేనని బాలీవుడ్ నటి విద్యాబాలన్ స్పష్టం చేశారు. చైల్డ్ సేఫ్టీ వీక్ సందర్భంగా మాట్లాడిన ఆమె.. పిల్లలు తమకు జరిగిన అన్యాయాన్ని ధైర్యంగా చెప్పినప్పుడు నమ్మాలని, కుటుంబ పరువు పేరుతో ఘటనలను దాచిపెట్టకుండా పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. తెలిసిన వ్యక్తులే నేరాలకు పాల్పడినా ప్రశ్నించాలని, పోక్సో చట్టంపై అవగాహన పెంచి నేరగాళ్లకు శిక్ష భయం కల్పించాలని అన్నారు. సినిమాలు చర్చకు దోహదపడతాయని, బాధితులకు న్యాయం జరిగేలా క్షేత్రస్థాయిలో పనిచేయడం సమాజం బాధ్యతని పేర్కొన్నారు.రాష్ట్రంలో జిల్లా పరిషత్ ఎన్నికల ప్రక్రియ పూర్తయింది. ఈ నెల 5న జడ్పీటీసీ పోలింగ్ జరిగింది. 7న ఫలితాలు వచ్చాయి. శుక్రవారం జడ్పీ చైర్మన్, వైఎస్ చైర్మన్ పదవులకు ఎన్నిక జరిగింది. దీంతో పరిషత్ ఎన్నికల కోలాహలం ముగిసినట్లైంది. ఎన్నికైన జడ్పీటీసీల పదవీ కాలం ఈ రోజుతో మొదలుకానుంది. రాష్ట్రంలో మొత్తం 28 జిల్లాలు ఉండగా, కూటమి పార్టీలు 27 జిల్లాలను కైవసం చేసుకున్నాయి. ఇందులో టీడీపీ 22 జిల్లాల్లో చైర్మన్ పదవులను తీసుకోగా, జనసేనకు 4 జిల్లా, బీజేపీకి ఒకటి చొప్పున కేటాయించారు. ఇక గురువారం అర్ధరాత్రి వరకు జరిగిన చర్చల్లో టీడీపీ తరఫున 22 మంది జాబితాను ప్రకటించారు. సామాజిక, రాజకీయ సమీకరణాలను చూసుకుని విడుదల చేసిన ఈ జాబితాలో పలువురు వారసులు, మాజీ ఎమ్మెల్యేలు పేర్లు ఉన్నాయి. కాకినాడ జిల్లా పరిషత్ చైర్మన్ పదవిని ఆశించిన మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మికి నిరాశ ఎదురైంది. జడ్పీ పీఠం ఆశించి ఆమె కాకినాడ రూరల్ నుంచి నామినేషన్ వేశారు. అయితే అనూహ్యంగా ఈ స్థానాన్ని జనసేన తీసుకోవడంతో మాజీ ఎమ్మెల్యే అనంతలక్ష్మి జడ్పీటీసీగా మిగిలిపోయారు.

వారసులకు అందలం

టీడీపీ తరఫున 22 జిల్లాలకు చైర్మన్లను ఎంపిక చేయగా, ఇందులో నాలుగో వంతు జిల్లాలకు వారసులే సారథులుగా బాధ్యతలు స్వీకరిస్తున్నారు. తీవ్ర ఉత్కంఠ రేపిన జిల్లాల్లో ఒకటైన విజయనగరం జిల్లాకు మజ్జి సిరిసహస్రను ఎంపిక చేశారు. ఈమె జడ్పీ మాజీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కుమార్తె. అయితే సిరి సహస్ర కులానికి సంబంధించిన వివాదం కోర్టులో పెండింగులో ఉండటంతో ఆమెకు అవకాశం ఇస్తారా? లేదా? అనే చర్చ ఎక్కువగా జరిగింది. అయితే ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ ముందుగా ఇచ్చిన మాట ప్రకారం, న్యాయ సలహా తీసుకుని సిరిసహస్రను చైర్మనుగా ఎంపిక చేశారు. దీంతో రాష్ట్రంలో అతిచిన్న వయసులో జడ్పీ చైర్ పర్సను అవుతున్న రికార్డును సిరిసహస్ర నమోదు చేశారు.ఇక ఈ లిస్టులో రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత కుమారుడు పరిటాల శ్రీరామ్ పేరు ప్రముఖంగా ఉంది. శ్రీసత్యసాయి జిల్లా తొలి చైర్మనుగా శ్రీరామ్ ప్రమాణస్వీకారం చేశారు. రాజకీయ కుటుంబానికి చెందిన శ్రీరామ్ ఎమ్మెల్యే కావాలని కలలు కన్నారు. 2019లో ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి చవిచూడగా, 2024లో పొత్తుల్లో భాగంగా ధర్మవరం సీటును త్యాగం చేశారు. అదే సమయంలో శ్రీరామ్ తల్లి సునీతకు సామాజిక సమీకరణాల్లో భాగంగా మంత్రిగా అవకాశం దక్కలేదు. దీంతో శ్రీరామ్ కు జడ్పీ చైర్మన్ పదవిని కేటాయించారని అంటున్నారు. అదేవిధంగా ఏలూరు జడ్పీ చైర్ పర్సన్ గా చింతమనేని సాయి నవ్యశ్రీ ఎంపికయ్యారు. ఈమె దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కుమార్తె. గత ఎన్నికల్లో నవ్యశ్రీకి ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని పార్టీ భావించింది. అయితే కార్యకర్తల ఒత్తిడితో చివరి నిమిషంలో ప్రభాకర్ కు వదలేసింది. మరోవైపు ఆయనను మంత్రిగా చేయాలని కేడర్ నుంచి డిమాండ్ రాగా, సామాజిక సమీకరణాలతో చాన్స్ ఇవ్వలేకపోయారు. ఫలితంగా ప్రభాకర్ కుమార్తె నవ్యశ్రీకి జడ్పీ పీఠం అప్పగించారని అంటున్నారు.

అదేవిధంగా వారసుల కోటాలో మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు కుమార్తె అమూల్య డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పరిషత్ చైర్ పర్సనుగా, మాజీ ఎమ్మెల్యే, ఎంపీ పాలకొండ్రాయుడు కుమారుడు సుగవాసి ప్రసాద్ బాబు అన్నమయ్య జిల్లా పరిషత్ చైర్మనుగా అవకాశం దక్కించుకున్నారు. మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు ప్రస్తుతం వైసీపీలో ఉండగా, ఆయన కుమార్తె అమూల్య పి.గన్నవరం నియోజకవర్గం టీడీపీ ఇంచార్జిగా ఉంటూ ఇప్పుడు జడ్పీ పీఠం ఎగరేసుకుపోయారని అంటున్నారు. ఇక అన్నమయ్య జిల్లా పరిషత్ చైర్మన్ సుగవాసి ప్రసాద్ బాబుకు సుదీర్ఘ నిరీక్షణ తరువాత పదవీయోగం పట్టిందని చెబుతున్నారు. టీడీపీ తరఫున మొత్తం 22 మంది జడ్పీ చైర్మన్లుగా బాధ్యతలు స్వీకరించారు. ఇందులో ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలు, ఒక మాజీ ఎమ్మెల్సీ ఉండటం గమనార్హం. పోలవరం జిల్లాకు మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి, నెల్లూరు జిల్లాకు మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసరావు, కడప జడ్పీ చైర్మనుగా మాజీ ఎమ్మెల్సీ పుత్తా నరసింహారెడ్డి ప్రమాణం చేశారు. ఆయా జిల్లాల్లో కూటమి పార్టీలకు సంపూర్ణ ఆధిక్యం ఉండటంతో ఎన్నిక ప్రక్రియసాఫీగా సాగిపోయింది. కాగా, టీడీపీ తరఫున జడ్పీ చైర్మన్లుగా ఎంపికైన వారిలో ఎక్కువ మంది విద్యావంతులే ఉండటం గమనార్హం. ఎన్టీఆర్ జిల్లా పరిషత్ చైర్మనుగా ప్రమాణం చేసిన కోట పుల్లమ్మ ఇంజనీరింగ్ పూర్తి చేసి కొన్నాళ్లు సాఫ్ట్ వేర్ ఉద్యోగిగా పనిచేశారు. అదేవిధంగా సిరిసహస్ర, సాయినవ్యశ్రీ, కూడా ఇంజనీరింగ్ పట్టభద్రులు కావడం విశేషం.

పులివెందులలో పంచాయతీ సెగ : పెట్రోల్ బాంబులు, రాళ్ల దాడులతో దద్దరిల్లిన గ్రామాలు!

పంచాయతీ ఎన్నికల నామినేషన్ల నేపథ్యంలో వైఎస్ జగన్ సొంత నియోజకవర్గం పులివెందులలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డి కాన్వాయ్‌పై పెట్రోల్ బాంబులతో దాడి చేశారని వైసీపీ ఆరోపించగా, వైసీపీ నేతలే తమ కార్యకర్తలు, ఆస్తులపై దాడులకు పాల్పడుతున్నారని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. నామినేషన్లను అడ్డుకోవడం, వాహనాలకు నిప్పు పెట్టడం, రాళ్ల దాడులు వంటి ఘటనలతో పలు మండలాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో టీడీపీ నేతలు బీటెక్ రవి, ఎమ్మెల్సీ భూమిరెడ్డి పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు.పంచాయతీ ఎన్నికల సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి సొంత నియోజకవర్గం పులివెందులలో తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఎన్నికల్లో పోటీ చేయకుండా తమను అడ్డుకుంటున్నారని, నామినేషన్లు వేయడానికి వెళితే దాడులు చేస్తున్నారని ఇరుపార్టీల వారు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటున్నారు. దీంతో నియోజకవర్గ రాజకీయాలలో హైటెన్షన్ నెలకొంది. మాజీ ముఖ్యమంత్రి జగన్ రెడ్డి నియోజకవర్గంలో పట్టు నిలబెట్టుకోవాలనే ప్రయత్నంలో అధికార పక్షం, కంచుకోటను కాపాడుకోవాలని వైసీపీ పావులు కదుపుతున్నాయి. ఈ నేపథ్యంలో దాడులు, ప్రతిదాడులు జరుగుతున్నట్లు చెబుతున్నారు.పంచాయతీ నామినేషన్ల పర్వం మొదలైన నుంచి పులివెందులలో ఉద్రిక్తతలు కొనసాగుతూనే ఉన్నాయి. మున్సిపల్ ఎన్నికల్లో మొదలైన రగడ పరిషత్ ఎన్నికల సమయంలో పతాకస్థాయికి చేరింది. ఇక పంచాయతీ ఎన్నికల్లో గ్రామాలు రణరంగాన్ని తలపిస్తున్నాయని చెబుతున్నారు. శుక్రవారం తమ అనుచరులతో నామినేషన్ వేయించేందుకు కడప ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డి సింహాద్రిపురం మండలానికి వెళ్లగా, మార్గమధ్యంలో ఆయన కాన్వాయ్ పై పెట్రోల్ బాంబులు వేశారని వైసీపీ ఆరోపించింది. ఇందుకు సంబంధించిన వీడియోలను ఎక్స్ లో పోస్టు పెట్టింది.సింహాద్రిపురం మండలం అంకాలమ్మ గూడూరు గ్రామ శివార్లలో టీడీపీ కార్యకర్తలు దాడికి దిగారని ఎంపీ అవినాశ్ రెడ్డి ఆరోపించారు. తాను ఐదు వాహనాల్లో వస్తున్నానని పోలీసులకు ముందుగా సమాచారం ఇచ్చానని, ఆయన టీడీపీ కార్యకర్తల దాడులను అడ్డుకోలేకపోయారని ఎంపీ ఫైర్ అయ్యారు. టీడీపీ ఇంచార్జి బీటెక్ రవి ఆధ్వర్యంలోనే ఈ దాడులు జరిగినట్లు ఆయన ఆరోపించారు. అధికారం ఉందని బరి తెగిస్తున్నారని మండిపడ్డారు. జిల్లా చరిత్రలో ఎప్పుడూ లేనట్లుగా కూటమి సర్కార్ లో అరాచకపర్వం కొనసాగుతోందని దుయ్యబట్టారు. వేముల మండలం వి. కొత్తపల్లె, గొందిపల్లె, వేంపల్లె మండలాల్లో వైసీపీ అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. చాగలూరు, కొండారెడ్డిపల్లె, నారేపల్లె గ్రామాల్లో నామినేషన్ల సమయంలో ఇరువర్గాల మధ్య రాళ్ల దాడి జరిగింది.మరోవైపు వైసీపీ నేతలే దాడులకు దిగుతున్నారని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. నియోజకవర్గంలోని చక్రాయపేట మండలం అగడూరు, తొండూరు మండలం మల్యాల, సింహాద్రిపురం మార్కెట్ కమిటీ చైర్మన్ బండి రామసుబ్బారెడ్డి ఆస్తులపై జరిగిన దాడులకు నిరసనగా టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి (బీటెక్ రవి), ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి పులివెందుల పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. వైసీపీ నేతలు నామినేషన్ కేంద్రాల వద్ద ట్రాక్టర్లతో భయభ్రాంతులకు గురిచేస్తున్నారని బీటెక్ రవి ఆరోపించారు. ఇడుపులపాయకు చెందిన టీడీపీ నాయకుడు పీపీ చెన్నరాయుడు ఎస్‌యూవీ వాహనాన్ని గుర్తుతెలియని వ్యక్తులు అడ్డగించి దహనం చేశారని తెలిపారు. తొండూరు మండలం మల్లెలలో టీడీపీ కార్యకర్తల ద్విచక్ర వాహనాలకు, అలాగే మరో చోట బొలెరో వాహనానికి నిప్పు పెట్టారు.

యుద్ధాల వేళ భారత్ శాంతి సందేశం!

ప్రపంచవ్యాప్తంగా ఎక్కడ చూసినా యుద్ధాలు, ఉద్రిక్తతలు, అశాంతిపైనే చర్చలు జరుగుతున్న ప్రస్తుత తరుణంలో భారత్ మాత్రం సాంస్కృతిక, నాగరికత సంబంధాలపై సంభాషణలు జరుపుతోందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ప్రపంచ శాంతికి ఈ సాంస్కృతిక అనుబంధాలే బలమైన భరోసాగా నిలుస్తాయని ఉద్ఘాటించారు. శుక్రవారం సాయంత్రం దిల్లీలోని చారిత్రాత్మక పురానా ఖిలా వేదికగా తొలి షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ సివిలైజేషన్ డైలాగ్ ఫోరంను ప్రధాని ప్రారంభించి ప్రసంగించారు.



పురానా ఖిలా వేదికగా ఆధ్యాత్మిక, సాంస్కృతిక సందేశం

మహాభారత కాలం నాటి విశేష చరిత్ర కలిగిన పురానా ఖిలా ఈ నాగరికత సంభాషణలకు సరైన వేదిక అని మోదీ కొనియాడారు. ప్రారంభోత్సవంలో ప్రదర్శించిన వేద మంత్రోచ్ఛారణలు, బౌద్ధ శాస్త్రం, హనుమంతుడి ప్రయాణ ఘట్టాలు వంటివి భారత సంస్కృతిని ప్రతిబింబించడమే కాకుండా యావత్ మానవాళికి ప్రేమ, ఐక్యత సందేశాన్ని అందించాయని ప్రధాని అన్నారు. 25 ఏళ్ల పూర్తి చేసుకున్న ఎస్సీఓ కూటమి ఇప్పటివరకు భద్రత, ఆర్థిక, కనెక్టివిటీ రంగాల్లో సహకారాన్ని బలోపేతం చేసిందని, ఇప్పుడు సాంస్కృతిక సహకారం సభ్య దేశాల మధ్య బంధాల్ని మరింత దృఢంగా మారుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 2025లో చైనాలోని టియాంజిన్‌లో జరిగిన ఎస్సీఓ సదస్సులో ప్రధాని మోదీ చేసిన ప్రతిపాదన మేరకు, కేంద్ర సాంస్కృతిక, విదేశాంగ శాఖల ఆధ్వర్యంలో నవంబర్ 20 నుంచి 22 వరకు ఈ 3 రోజుల సదస్సు జరుగుతోంది.

ఎస్సీఓ దేశాలకు మోదీ కీలక ప్రతిపాదనలు

సభ్య దేశాల మధ్య సాంస్కృతిక వారసత్వాన్ని కొత్త తరానికి అందించడానికి ప్రధాని మోదీ పలు కీలక సూచనలు చేశారు. ప్రాచీన గ్రంథాల డిజిటలీకరణ, ఏఐ ట్రాన్స్‌లేషన్- మ్యూజియంలు, గ్రంథాలయాల్లోని వేలాది ఏళ్ల నాటి తాళపత్ర గ్రంథాలు, అరుదైన చారిత్రక పత్రాల్ని డిజిటలైజ్ చేయాలని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ూ×) సాయంతో గొప్ప గొప్ప సాహిత్య గ్రంథాలను ఇతర భాషల్లోకి వేగంగా అనువదించి ప్రపంచానికి అందుబాటులోకి తీసుకురావాలి. ఈ అమూల్యమైన సంపదను డిజిటలైజేషన్ చేయడం, ప్రాచీన గ్రంథాలను వివిధ భాషల్లోకి అనువదించడం కోసం ఎస్సీఓ దేశాలన్నీ కలిసిగట్టుగా పనిచేయాలని సూచించారు.

ఉమ్మడిగా పరిశోధనలు- విశ్వవిద్యాలయాలు, పరిశోధన సంస్థల సంయుక్తంగా పరిశోధనలు నిర్వహించాలి. దీని ద్వారా ఉమ్మడి చరిత్రకు సంబంధించిన కొత్త విషయాల్ని వెలుగులోకి తీసుకురావొచ్చని అన్నారు. దీని వల్ల ప్రపంచంలోని ఏ ప్రాంతానికి చెందిన యువత అయినా మరో దేశ సాంస్కృతిక వారసత్వాన్ని మరింత లోతుగా తెలుసుకోగలుగుతారని వివరించారు. బౌద్ధ వారసత్వ, సిల్క్ రూట్ సర్క్యూట్లు- ఎస్సీఓ దేశాల్లో ఉన్న సిల్క్ రూట్స్, బౌద్ధ వారసత్వంతో ముడిపడిన ఎన్నో చారిత్రక ప్రదేశాలు ఉన్నాయని మోదీ గుర్తుచేశారు. ఈ ప్రాంతాల్ని అనుసంధానం చేస్తూ హెరిటేజ్ సర్క్యూట్లు, సాంస్కృతిక పర్యటక మార్గాల్ని అభివృద్ధి చేసే అవకాశాల్ని పరిశీలించాలని సూచించారు. ఉమ్మడి ప్రదర్శనలు, సాంస్కృతిక ఉత్సవాలు- సంయుక్త సాంస్కృతిక ఉత్సవాలు, కళాకారుల మార్పిడి కార్యక్రమాల ద్వారా వివిధ దేశాల కళలు, సంప్రదాయాలను కొత్త ప్రేక్షకులకు పరిచయం చేయవచ్చని చెప్పారు.

తొలుత ఇక్కడ 'వసుధైవ కుటుంబకం- ప్రపంచమంతా ఒకే కుటుంబం' థీమ్‌తో సివిలైజేషన్స్ అన్ కన్వర్జేషన్ పేరుతో నృత్య, సంగీత ప్రదర్శన నిర్వహించారు. 'అస్తిత్వ- ది ఎసెన్స్ ఆఫ్ అవర్ ఎగ్జిస్టెన్స్' పేరుతో భారత పురావస్తు, సాహిత్య వారసత్వాన్ని తెలిపే ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఇక్కడ క్రీస్తుపూర్వం 1200 నుంచి క్రీస్తుశకం 1200 వరకు దిల్లీ చరిత్రకు సంబంధించిన తవ్వకాల్లో లభించిన వస్తువులు, ఇతర నిర్మాణ అవశేషాలు, కళాఖండాలు ఇందులో ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ కూడా పాల్గొన్నారు. నాగరికతలు ఒంటరిగా కాకుండా సంభాషణల ద్వారానే అభివృద్ధి చెందుతాయని ఆయన అన్నారు. ఈ ఫోరమ్ సహకారంలో సరికొత్త అధ్యాయాన్ని లిఖిస్తుందని వ్యాఖ్యానించారు. ఉమ్మడి వారసత్వాన్ని ఉమ్మడి కార్యచరణ ప్రణాళికగా మార్చుకోవాలని అన్నారు. నవంబర్ 20-22 వరకు భారత్ 3 రోజుల ఈ ఫోరంను నిర్వహిస్తోంది. నవంబర్ 21, 22 తేదీల్లో నాలుగు ప్రధాన అంశాలపై చర్చలు జరగనున్నాయి.

పట్టాలెక్కనున్న తొలి స్వదేశీ బుల్లెట్ ట్రైన్!

భారత రైల్వే చరిత్రలో మరో కీలక ఘట్టానికి రంగం సిద్ధమవుతోంది. దేశీయ పరిజ్ఞానంతో రూపొందుతున్న తొలి స్వదేశీ బుల్లెట్ రైలు త్వరలో పట్టాలెక్కనుంది. 'దీ28' పేరుతో తయారవుతున్న ఈ హైస్పీడ్ రైలుకు సంబంధించి 2027 మధ్య నాటికి ట్రాక్ ట్రయల్స్ ప్రారంభించాలని రైల్వే శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. అదే ఏడాది చివరి త్రైమాసికంలో తొలి వాణిజ్య సర్వీసును ప్రారంభించే అవకాశం ఉందని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. తొలుత సూరత్--వాపి మధ్య సేవలు ప్రారంభించి, అనంతరం దశలవారీగా ముంబయి వరకు విస్తరించనున్నారు.



280 కి.మీ. వేగంతో పరుగులు

భారత్‌లో తయారవుతున్న తొలి స్వదేశీ బుల్లెట్ రైలుకు దీ28గా పేరు పెట్టారు. ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ (×జఖీ), భారత్ ఎర్త్ మూవర్స్ లిమిటెడ్ (దీజుమీ) సంయుక్తంగా ఈ రైలును రూపొందిస్తున్నాయి. బెంగళూరులోని బీఈఎంఎల్ తయారీ కేంద్రంలో నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. గంటకు 280 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించేలా రైలును తీర్చిదిద్దుతున్నారు. ఇప్పటికే తొలి బాడీ ఫ్రేమ్ నిర్మాణం పూర్తికాగా, ప్రస్తుతం నిర్మాణ నాణ్యత, సామర్థ్యాన్ని పరీక్షించే ప్రక్రియ కొనసాగుతోంది. 2027 మధ్యలో ట్రాక్ ట్రయల్స్ చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. తదుపరి దశలో గంటకు 350 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే దీ35 రైలును అభివృద్ధి చేయాలని రైల్వే శాఖ భావిస్తోంది.

8 కోచ్‌లు.. 557 మంది ప్రయాణం

ఈ బుల్లెట్ రైలు సుమారు 202 మీటర్ల పొడవుతో ఎనిమిది కోచ్‌లను కలిగి ఉంటుంది. నాలుగు మోటార్ కార్లు, నాలుగు ట్రైలర్ కార్లతో నిర్మిస్తున్నారు. మొత్తం 557 మంది ప్రయాణించే సామర్థ్యం ఉంటుంది. ఇందులో ఏడు స్టాండర్డ్ క్లాస్ కోచ్‌లు, ఒక ఎగ్జిక్యూటివ్ క్లాస్ కోచ్ ఉంటాయి. స్టాండర్డ్ క్లాస్‌లో 3ఐ2 సీటింగ్, ఎగ్జిక్యూటివ్ క్లాస్‌లో 2ఐ2 సీటింగ్ ఏర్పాటు చేస్తున్నారు. రెండు వైపులా డ్రైవర్ క్యాబిన్లు, ఆపరేషన్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానమయ్యే ఆధునిక నియంత్రణ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు. అవసరాన్ని బట్టి రెండు ఎనిమిది కోచ్‌ల రైళ్లను కలిపి 16 కోచ్‌లుగా కూడా నడిపే అవకాశం ఉంటుంది.

ప్రయాణికులకు ఆధునిక సౌకర్యాలు

భారతీయ ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా రైలు అంతర్గత నిర్మాణాన్ని రూపొందిస్తున్నారు. సౌకర్యవంతమైన సీట్లు, కాళ్లు చాపుకునేందుకు తగినంత స్థలం, ఎల్ఈడీ లైటింగ్, లగేజీ ర్యాకులు, మొబైల్, ల్యాప్‌టాప్ ఛార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేస్తున్నారు. అత్యాధునిక బయో డైజెస్టర్ టాయిలెట్లు, విశాలమైన కిటికీలు, ఒక కోచ్ నుంచి మరో కోచ్‌లోకి సులభంగా వెళ్లేందుకు సీల్డ్ గ్యాంగ్‌వే సదుపాయం కల్పిస్తున్నారు.

ముంబయి-అహ్మదాబాద్ మధ్య ప్రయాణం వేగవంతం

ముంబయి--అహ్మదాబాద్ హైస్పీడ్ రైలు కారిడార్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే రెండు నగరాల మధ్య ప్రయాణ సమయం గణనీయంగా తగ్గనుంది. ప్రస్తుతం రోడ్డు మార్గంలో 8 నుంచి 9 గంటలు పడుతుండగా, బుల్లెట్ రైలు ద్వారా సుమారు గంటా 58 నిమిషాల్లోనే చేరుకోవచ్చని రైల్వే మంత్రి వెల్లడించారు. తొలుత సూరత్--వాపి మధ్య సర్వీసులు ప్రారంభించి, అనంతరం మిగిలిన మార్గాన్ని దశలవారీగా అందుబాటులోకి తీసుకురానున్నారు.

2017లో ప్రాజెక్టుకు శ్రీకారం

ముంబయి--అహ్మదాబాద్ హైస్పీడ్ రైలు ప్రాజెక్టుకు 2017 సెప్టెంబరులో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, జపాన్ ప్రధాని షింజో అబే సమక్షంలో పునాది పడింది. ఈ ప్రాజెక్టుకు జపాన్ తన హైస్పీడ్ రైలు సాంకేతికతను అందిస్తోంది. స్వదేశీ రైలు తయారీతో పాటు ఆధునిక రైల్వే సాంకేతికతలో భారత్ సామర్థ్యాన్ని పెంచుకునే దిశగా ఈ ప్రాజెక్టు కీలకంగా మారనుంది.

భారత్‌తో వాణిజ్య ఒప్పందాలకు ప్రపంచ దేశాల ఆసక్తి

భారత్‌తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు (ఎఫ్‌టీఏ) కుదుర్చుకునేందుకు ప్రపంచంలోని పలు దేశాలు ఆసక్తి చూపుతున్నాయని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. అంతర్జాతీయ భాగస్వాములు భారత మార్కెట్‌లోకి ప్రవేశాన్ని విస్తరించుకోవడంతో పాటు, వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలని కోరుకుంటున్నారని పేర్కొన్నారు. తాను ఏ దేశానికి వెళ్లినా భారత్‌తో ఎఫ్‌టీఏ కుదుర్చుకోవాలనే అభ్యర్థనలు వస్తున్నాయని చెప్పారు. దిల్లీలో జరిగిన ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫిక్కీ) వార్షిక సర్వసభ్య సమావేశం ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

ఈజిప్ట్, ఇటలీ నుంచి ఆసక్తి

తాను ఇటీవల ఈజిప్టలో పర్యటించినప్పుడు ఇరు దేశాల అధికార బృందాలు సమావేశమయ్యాయని గోయల్ వెల్లడించారు. ఎఫ్‌టీఏ అవకాశాలను పరిశీలించి, తదుపరి విధివిధానాలను ఖరారు చేయాలని ఇరు దేశాలు తమ అధికారులను కోరినట్లు తెలిపారు. ఇటలీ కూడా భారత్‌తో వాణిజ్య ఒప్పందానికి ఆసక్తి చూపుతోందన్నారు. భారత్--యూరోపియన్ యూనియన్ (ఈయూ) మధ్య కుదిరే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై సంతకాలు, అమలు కోసం అక్కడి వ్యాపార వర్గాలు ఎదురుచూస్తున్నాయని పేర్కొన్నారు. పెరుగుతున్న వాణిజ్య ఒప్పందాల నెట్‌వర్క్ భారతీయ సంస్థలకు అంతర్జాతీయ మార్కెట్లలో కొత్త అవకాశాలను కల్పిస్తోందని వివరించారు.

85 ట్రిలియన్ డాలర్ల మార్కెట్లకు చేరువ

ప్రపంచ మార్కెట్లలో భారతదేశ ప్రాధాన్యతను పెంచడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు పీయూష్ గోయల్ తెలిపారు. ప్రస్తుతం భారత్ కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందాల పరిధిలో సుమారు 70 ట్రిలియన్ డాలర్ల విలువైన ప్రపంచ మార్కెట్లు ఉన్నాయని చెప్పారు. 2014కు ముందు ఈ విలువ 10 ట్రిలియన్ డాలర్లుగా ఉండేదని పేర్కొన్నారు. వచ్చే ఏడాది నుంచి ఏడాదిన్నర కాలంలో మరో 8--9 ద్వైపాక్షిక ఒప్పందాలు కుదిరితే అదనంగా 15 ట్రిలియన్ డాలర్ల మార్కెట్లకు అవకాశం ఏర్పడుతుందని అంచనా వేశారు. దీంతో మొత్తం 85 ట్రిలియన్ డాలర్ల మార్కెట్ల పరిధిలోకి భారత్ చేరుతుందని, ఇది ప్రపంచ జీడీపీలో సుమారు 76 శాతానికి సమానమని వివరించారు. ఇతర ఆర్థిక వ్యవస్థలపై భారత్ ఆధారపడటాన్ని తగ్గించుకోవాలని, అదే సమయంలో ప్రపంచ దేశాలు భారత్‌పై ఆధారపడేలా దేశ ఆర్థిక, వాణిజ్య విధానాలను అభివృద్ధి చేసుకోవాలని గోయల్ అభిప్రాయపడ్డారు.



చిన్న వ్యాపారులు, రైతులకూ ప్రయోజనాలు

వాణిజ్య ఒప్పందాల ప్రయోజనాలు కేవలం పెద్ద కంపెనీలకే పరిమితం కాకుండా చిరు వ్యాపారులు, రైతులు, చేతివృత్తులవారు, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు కూడా అందాలని గోయల్ స్పష్టం చేశారు. ఈ ఒప్పందాలు భారతీయ వ్యాపారాలకు కొత్త అవకాశాలను తెరుస్తాయని చెప్పారు. విదేశీ మార్కెట్లతో భారతీయ సంస్థలకు అనుసంధానం కల్పించేలా ఫిక్కీ తన అంతర్జాతీయ పరిధిని మరింత విస్తరించాలని సూచించారు. దేశీయ వ్యాపారాలకు, అంతర్జాతీయ అవకాశాలకు మధ్య పారిశ్రామిక మండలి వారధిగా నిలవాలని పిలుపునిచ్చారు. అమెరికాకు చెందిన పలు కంపెనీలు భారత్‌లో డిజైన్, పరిశోధన కార్యకలాపాలను విస్తరించాలని యోచిస్తున్నాయని పీయూష్ గోయల్ తెలిపారు. దేశంలో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల (జీసీసీ) ఏర్పాటుపైనా ఆసక్తి చూపుతున్నాయని వెల్లడించారు. దిల్లీలో గురువారం జరిగిన 23వ ఇండో--యూఎస్ ఎకనామిక్ సమ్మిట్ ముగింపు సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. భారత్‌లో అందుబాటులో ఉన్న నైపుణ్యం కలిగిన మానవ వనరులను వినియోగించుకుని తమ వ్యాపార ప్రక్రియల నిర్వహణ కార్యకలాపాలను కూడా విస్తరించాలని కొన్ని అమెరికా కంపెనీలు భావిస్తున్నాయని చెప్పారు.

2027లో క్వాడ్ బిజినెస్ లీడర్స్ ఫోరమ్

మొట్టమొదటి క్వాడ్ బిజినెస్ లీడర్స్ ఫోరమ్ నిర్వహణకు భారతీయ వ్యాపార ప్రతినిధులను ఒకచోట చేర్చడంలో ఇండో-అమెరికన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్, ఇతర పారిశ్రామిక సంస్థలు సహకరిస్తాయని ఆశిస్తున్నట్లు గోయల్ తెలిపారు. వ్యాపారవేత్తలు, ప్రభుత్వ అధికారులు, విధాన నిపుణులను ఒకే వేదికపైకి తీసుకొచ్చి వాణిజ్య భాగస్వామ్యాలను ప్రోత్సహించడమే ఈ ఫోరమ్ లక్ష్యమని పేర్కొన్నారు. 2027 ప్రారంభంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నాలుగు క్వాడ్ దేశాలు నవంబర్ 17న మనీలాలో ప్రకటించాయని వివరించారు.

ఎవరి ఆకలి తీరడం లేదో దేశానికి తెలుసు!

ప్రధాని నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా దుమారం రేపుతున్నాయి. పారిశ్రామికవేత్తలకు పన్ను రాయితీలు కల్పించినప్పటికీ ఉద్యోగుల జీతాలు పెంచడం, కొత్త ఉద్యోగాల కల్పనలో ఆశించిన స్థాయిలో ఫలితాలు కనిపించడం లేదన్న ప్రధాని వ్యాఖ్యలపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రంగా స్పందించారు. అసలు ఎవరి ఆకలి తీరడం లేదో దేశ ప్రజలకు తెలుసంటూ ఎక్స్ వేదికగా ఘాటు విమర్శలు చేశారు. ప్రభుత్వ ఆర్థిక విధానాలు, కార్పొరేట్ రంగానికి కల్పిస్తున్న ప్రయోజనాలపై ప్రశ్నలు సంధించారు.

మోదీ వ్యాఖ్యలకు రాహుల్ కౌంటర్

దిల్లీలో జరిగిన ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫిక్కీ) శతాబ్ది సదస్సులో ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలపై రాహుల్ గాంధీ స్పందించారు. పారిశ్రామికవేత్తలపై ప్రధాని చేసిన వ్యాఖ్యలు వారి తప్పులను ఎత్తిచూపడం కాదని, ప్రభుత్వ వైఫల్యాలను బయటపెట్టినట్లుగా ఉన్నాయని విమర్శించారు. విమానాశ్రయాలు, ఓడరేవులు, గనులు, అడవులు, విద్యుత్, బొగ్గు, రహదారులు వంటి కీలక రంగాలు కొందరి చేతుల్లో కేంద్రీకృతమయ్యాయని ఆరోపించారు. ఇంతటి ప్రయోజనాలు పొందుతున్న సంస్థలు ఎన్ని ఉద్యోగాలు కల్పించాయని ప్రశ్నించారు.

చిన్న పరిశ్రమలకు ఇబ్బందులు: రాహుల్

ఉపాధి కల్పనలో కీలక పాత్ర పోషించే సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ) పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ విధానాల వల్ల తీవ్రంగా దెబ్బతిన్నాయని రాహుల్ ఆరోపించారు. గుత్తాధిపత్య ధోరణుల వల్ల మార్కెట్‌లో పోటీ తగ్గి, ధరలు పెరిగే పరిస్థితి ఏర్పడుతోందని అభిప్రాయపడ్డారు. ద్రవ్యోల్బణంతో ఇబ్బందులు పడుతున్న పేద, మధ్యతరగతి ప్రజలు, ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువత ప్రభుత్వ విధానాల పట్ల అసంతృప్తితో ఉన్నారని విమర్శించారు.

ప్రతిపక్ష నేతలా మాట్లాడారు: ఖర్గే

కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సైతం ప్రధాని వ్యాఖ్యలపై విమర్శలు గుప్పించారు. 12 ఏళ్ల పాలన తర్వాత తన ప్రభుత్వ వైఫల్యాలకు వ్యాపార వర్గాలను బాధ్యులను చేస్తూ మోదీ ప్రతిపక్ష నేతలా మాట్లాడారని ఎక్స్‌లో పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో అధిక వృద్ధి నమోదైందని చెబుతూ, ప్రస్తుత ప్రభుత్వం కొందరు పెట్టుబడిదారులకు దేశ వనరులను అప్పగిస్తోందని ఆరోపించారు. ఆరోగ్యకరమైన పోటీ లేకపోవడం వల్ల భారత ఉత్పత్తుల నాణ్యత, అంతర్జాతీయ బ్రాండ్ విలువ దెబ్బతింటున్నాయని విమర్శించారు.

మేక్ ఇన్ ఇండియాపై కాంగ్రెస్ విమర్శలు

దేశంలో ఉద్యోగావకాశాలు తగ్గడం, పొదుపులు క్షీణించడం, ద్రవ్యోల్బణం పెరగడం వంటి సమస్యలను ఖర్గే ప్రస్తావించారు. ప్రభుత్వ రంగ సంస్థల పరిస్థితిపైనా ఆందోళన వ్యక్తం చేశారు. 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమం ఆశించిన ఫలితాలు ఇవ్వడం లేదని, దిగుమతులపై ఆధారపడే పరిస్థితి పెరుగుతోందని విమర్శించారు. ఆర్థిక వ్యవస్థ కొందరి చేతుల్లో కేంద్రీకృతం కావడం దేశానికి నష్టదాయకమని వ్యాఖ్యానించారు.

పన్ను రాయితీలిచ్చినా ఉద్యోగాలేవి?

అంతకుముందు ఫిక్కీ సదస్సులో ప్రధాని మోదీ మాట్లాడుతూ, వ్యాపార అనుకూల వాతావరణాన్ని కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం అనేక సంస్కరణలు చేపట్టిందని వివరించారు. 2014లో 30 శాతంగా ఉన్న ప్రాథమిక కార్పొరేట్ పన్ను రేటును 22 శాతానికి తగ్గించామని, వ్యక్తిగత ఆదాయపు పన్నులోనూ రాయితీలు కల్పించామని గుర్తుచేశారు. అయినప్పటికీ పారిశ్రామికవేత్తలు ఉద్యోగుల వేతనాలను పెంచడం, కొత్త ఉద్యోగాలను సృష్టించడంలో మరింత చొరవ చూపాలని సూచించారు.

కేంద్ర విధానాలపై జైరాం రమేశ్ విమర్శలు

కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ కూడా ప్రధాని వ్యాఖ్యలపై స్పందించారు. ద్రవ్యోల్బణం, ఉపాధి కల్పన, ప్రైవేటు పెట్టుబడుల అంశాల్లో ప్రభుత్వం ఆశించిన ఫలితాలు సాధించలేదని విమర్శించారు. సంపద సృష్టించే పారిశ్రామికవేత్తలపై ప్రధాని అసహనం వ్యక్తం చేయడం సరికాదని వ్యాఖ్యానించారు. దర్యాప్తు సంస్థల చర్యలతో పరిశ్రమల్లో ఆందోళనకర వాతావరణం నెలకొందని, చిన్న వ్యాపారాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆరోపించారు.

దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగొద్దు

మరోవైపు నియోజకవర్గాల పునర్విభజన అంశంపైనా జైరాం రమేశ్ స్పందించారు. ఈ ప్రక్రియపై అన్ని రాజకీయ పార్టీలతో చర్చించి నిర్ణయం తీసుకోవాలని కాంగ్రెస్ కోరుతోందని తెలిపారు. లోక్‌సభ స్థానాల సంఖ్య 543గానే కొనసాగించాలని, రాష్ట్రాలవారీగా సీట్ల పంపిణీలో మార్పులు చేయకూడదని, మహిళలకు మూడో వంతు స్థానాలు కేటాయించాలని, ఈ ఏర్పాట్లపై 25 ఏళ్లపాటు ఎలాంటి మార్పులు ఉండకూడదని కాంగ్రెస్ ప్రతిపాదిస్తున్నట్లు వివరించారు. జనగణన అనంతరం రాజ్యాంగంలోని ఆర్టికల్ 82 ప్రకారం నియోజకవర్గాల పునర్విభజన చేపడితే దక్షిణాది రాష్ట్రాలకు ప్రాతినిధ్యపరంగా నష్టం జరిగే అవకాశం ఉందని కాంగ్రెస్ ఆందోళన వ్యక్తం చేస్తోందన్నారు. ఈ అంశంపై ఇండియా కూటమి పార్టీల మధ్య ఏకాభిప్రాయం ఉందని పేర్కొన్నారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల ముగింపు, శీతాకాల సమావేశాల నిర్వహణపై కూడా జైరాం రమేశ్ పలు ప్రశ్నలు లేవనెత్తారు

సీఈసీ, ఈసీ నియామక చట్టంపై రీకాల్ పిటిషన్ తిరస్కరణ!

ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ), ఎన్నికల కమిషనర్ల (ఈసీ) నియామక చట్టం చెల్లుబాటుపై దాఖలైన పిటిషన్ల విచారణలో సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ఈ అంశాన్ని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం విచారిస్తుందని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. గతంలో ద్విసభ్య ధర్మాసనం ఇచ్చిన భిన్నాభిప్రాయాల తీర్పును వెనక్కి తీసుకోవాలని కోరుతూ దాఖలైన రీకాల్ పిటిషన్‌ను విడిగా విచారించేందుకు నిరాకరించారు.

ఐదుగురు సభ్యుల ధర్మాసనం ముందుకే..

న్యాయవాది ప్రశాంత్ భూషణ్ దాఖలు చేసిన రీకాల్ పిటిషన్ సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ముందుకు వచ్చింది. రీకాల్ దరఖాస్తు, రిఫరెన్స్ ఉత్తర్వులపై అభ్యంతరాలు, 2023 నాటి సీఈసీ, ఈసీల నియామక చట్టం రాజ్యాంగబద్ధత వంటి అంశాలన్నింటినీ ఐదుగురు సభ్యుల ధర్మాసనమే పరిశీలిస్తుందని సీజేఐ తెలిపారు. ఈ పిటిషన్‌ను తిరిగి పాత ధర్మాసనం ముందుకు పంపాలన్న ప్రశాంత్ భూషణ్ అభ్యర్థనను అంగీకరించలేదు.

న్యాయమూర్తి పదవీ విరమణ చేసినా విచారణ

గతంలో భిన్నాభిప్రాయం వ్యక్తం చేసిన న్యాయమూర్తుల్లో ఒకరు త్వరలో పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో రీకాల్ పిటిషన్‌ను పచ్చే వారంలోనే విచారించాలని ప్రశాంత్ భూషణ్ కోరారు. దీనిపై స్పందించిన సీజేఐ.. ధర్మాసనంలోని న్యాయమూర్తుల్లో ఒకరు పదవీ విరమణ చేసినా రాజ్యాంగ ధర్మాసనం ఈ అంశాన్ని విచారించవచ్చని స్పష్టం చేశారు. ఈ అంశాన్ని ఐదుగురు సభ్యుల ధర్మాసనం ముందే లేవనెత్తాలని సూచించారు.

ద్విసభ్య ధర్మాసనంలో భిన్నాభిప్రాయాలు

సీఈసీ, ఈసీల నియామక ప్రక్రియను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను గతంలో జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ సతీశ్ చంద్ర శర్మలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. అయితే ఈ కేసును విస్తృత ధర్మాసనానికి నివేదించాలా? లేదా? అనే అంశంపై ఇద్దరు న్యాయమూర్తుల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. జస్టిస్ దత్తా ఈ పిటిషన్లను ద్విసభ్య ధర్మాసనమే విచారించవచ్చని అభిప్రాయపడగా, రాజ్యాంగపరమైన కీలక అంశాలు ముడిపడి ఉన్నందున ఐదుగురు సభ్యుల ధర్మాసనం పరిశీలించాలని జస్టిస్ శర్మ పేర్కొన్నారు. 2023 నాటి చట్టం ప్రకారం సీఈసీ, ఈసీల ఎంపిక కమిటీలో ప్రధానమంత్రి, లోక్‌సభలో ప్రతిపక్ష నేత, ప్రధానమంత్రి నామినేట్ చేసిన కేంద్ర మంత్రి సభ్యులుగా ఉంటారు. గతంలో ఈ ఎంపిక ప్రక్రియలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి ఉన్న పాత్రను తొలగించడాన్ని సవాల్ చేస్తూ పిటిషన్లు దాఖలయ్యాయి. ఎన్నికల సంఘం స్వతంత్రత, తటస్థతకు ఈ చట్టం విఘాతం కలిగిస్తోందని పిటిషనర్లు వాదిస్తున్నారు.

ఎన్నికల సంఘం స్వతంత్రతపై ప్రశ్నలు

జస్టిస్ దీపాంకర్ దత్తా తన అభిప్రాయంలో ఎన్నికల సంఘం స్వతంత్రత, తటస్థతపై ఆందోళనలు వ్యక్తం చేశారు. స్వేచ్ఛాయుత ఎన్నికలు నిర్వహించేందుకు 2023 చట్టం రాజ్యాంగ ప్రమాణాలకు అనుగుణంగా ఉందా? అనే ప్రశ్నను లేవనెత్తారు. మరోవైపు జస్టిస్ సతీశ్ చంద్ర శర్మ ఈ అంశంలో కీలకమైన న్యాయపరమైన ప్రశ్నలు ఉన్నందున విస్తృత ధర్మాసనం పరిశీలన అవసరమని అభిప్రాయపడ్డారు. ఈ భిన్నాభిప్రాయాల నేపథ్యంలోనే కేసు సీజేఐ ముందుకు వచ్చింది.

బిజినెస్

దిగ్గజ సంస్థలకు సైబర్ సెగ..

వీసా, మాస్టర్‌కార్డ్ కస్టమర్ల డేటా లీక్

వీసా, మాస్టర్‌కార్డ్, జేపీ మోర్గాన్ కస్టమర్ల డేటాపై సైబర్ దాడి

థర్డ్-పార్టీ సర్వీస్ ప్రొవైడర్ల నుంచే వివరాలు లీక్ అయినట్లు వెల్లడి

కార్డు నంబర్లు కాకుండా ఈమెయిళ్లు, పేర్లు వంటివి మాత్రమే బహిర్గతం

'అ0అ' అనే హ్యాకర్ల ముఠా పనేనని వెల్లడి, ఆన్‌లైన్‌లో డేటా విడుదల

ఈ వివరాలతో ఫిషింగ్ దాడులు జరిగే ప్రమాదం ఉందని హెచ్చరిక



ప్రపంచ ప్రఖ్యాత ఆర్థిక సేవల సంస్థలు వీసా, మాస్టర్‌కార్డ్, జేపీ మోర్గాన్ చేజ్‌కు సైబర్ దాడి సెగ తగిలింది. తమ కస్టమర్లకు సంబంధించిన కొంత సమాచారం బయటకు పొక్కినట్లు ఈ సంస్థలు ధ్రువీకరించాయి. అయితే, ఈ దాడి తమ సొంత సిస్టమ్స్‌పై జరగలేదని, తమకు సేవలు అందించే థర్డ్-పార్టీ సంస్థలే లక్ష్యంగా జరిగిందని స్పష్టం చేశాయి. ఈ ఘటనల వల్ల తమ కోర్ పేమెంట్ నెట్‌వర్క్‌లకు గానీ, చెల్లింపుల వ్యవస్థలకు గానీ ఎలాంటి ముప్పు వాటిల్లలేదని భరోసా ఇచ్చాయి. 'అ0అ' అనే రాన్సమ్‌వేర్, దోపిడీ ముఠా ఈ సైబర్ దాడులకు బాధ్యత వహించింది. డబ్బులు చెల్లించేందుకు తాము విధించిన గడువు ముగియడంతో నిన్న కస్టమర్ల డేటాను ఆన్‌లైన్‌లో విడుదల చేసినట్లు ఈ గ్రూప్ ప్రకటించింది. లీకైన డేటాలో కస్టమర్ల కార్డు నంబర్లు, లావాదేవీల వివరాలు వంటి అత్యంత కీలకమైన సమాచారం లేదని, కేవలం ఈమెయిల్ చిరునామాలు, పేర్లు, మార్కెటింగ్ లేదా లాయల్టీ ప్రోగ్రామ్‌లకు సంబంధించిన రికార్డులు మాత్రమే ఉన్నాయని తెలిసింది. ఆసియా-పసిఫిక్ రీజియన్‌లోని తమ థర్డ్-పార్టీ సర్వీస్ ప్రొవైడర్‌పై ఈ దాడి జరిగిందని వీసా పేర్కొంది. ప్రీమియం డైనింగ్, లాయల్టీ ప్రోగ్రామ్‌లకు సంబంధించిన వేలాది మంది కార్డుదారుల వివరాలు ఇందులో ఉన్నట్లు సమాచారం. తమ పేమెంట్ సిస్టమ్స్‌కు ఎలాంటి నష్టం వాటిల్లలేదని, కార్డు వివరాలు సురక్షితంగా ఉన్నాయని వీసా తెలిపింది. అదేవిధంగా ఒక నిర్దిష్ట బెనిఫిట్ ప్రోగ్రామ్‌లో ఉన్న కొద్దిమంది కస్టమర్ల ఈమెయిల్ వివరాలు మాత్రమే లీక్ అయ్యాయని, పేమెంట్ నెట్‌వర్క్‌పై దీని ప్రభావం లేదని మాస్టర్‌కార్డ్ వివరించింది. తమ బయటి వెండర్లపై దాడి జరిగిందని, కస్టమర్ల పేర్లు, ఈమెయిల్స్ వంటి మార్కెటింగ్ డేటా హ్యాకర్ల చేతికి చిక్కినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలిందని జేపీ మోర్గాన్ చేజ్ వెల్లడించింది. కార్డు నంబర్లు లీక్ కాకపోయినప్పటికీ, బహిర్గతమైన ఈమెయిల్స్, పేర్లతో కస్టమర్లను లక్ష్యంగా చేసుకుని మోసపూరిత 'ఫిషింగ్' దాడులు జరిగే ప్రమాదం ఉందని సైబర్ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం ఈ మూడు సంస్థలు దర్యాప్తు కొనసాగిస్తుండగా, ప్రభావితమైన కస్టమర్లకు అవసరమైన మద్దతు అందిస్తామని హామీ ఇచ్చాయి.

టాటా గ్రూప్‌లో అధికార పోరు..

లిస్టింగ్‌పై చర్చకు సిద్ధమైన అతిపెద్ద వాటాదారు

టాటా సన్స్ పబ్లిక్ లిస్టింగ్‌పై గ్రూప్‌లో తీవ్రమైన విభేదాలు

నేడు టాటా ట్రస్టుల సమావేశం, వచ్చే వారం టాటా సన్స్ బోర్డు భేటీ

లిస్టింగ్‌ను వ్యతిరేకిస్తున్న ట్రస్టుల ఛైర్మన్ నోయెల్ టాటా, మద్దతిస్తున్న బోర్డు సభ్యులు

ఛైర్మన్ చంద్రశేఖరన్ పదవీకాల పొడిగింపుపైనా రాజుకున్న వివాదం

ఆర్బీఐ నిబంధనల ప్రకారం లిస్టింగ్ తప్పనిసరి కావడంతో ముదిరిన సంక్షోభం





దేశంలోని అతిపెద్ద వ్యాపార సామ్రాజ్యాల్లో ఒకటైన టాటా గ్రూప్‌లో అంతర్గత వివాదం తీవ్ర రూపం దాల్చింది. హోల్డింగ్ కంపెనీ అయిన టాటా సన్స్‌ను పబ్లిక్ లిస్టింగ్ చేయాలా వద్దా అనే అంశంపై గ్రూప్‌లో భిన్నాభిప్రాయాలు భగ్గుమన్నాయి. ఈ పరిణామాల మధ్య, టాటా గ్రూప్‌లో కీలకమైన రెండు వారాలు మొదలయ్యాయి. శుక్రవారం నాడు టాటా ట్రస్టుల బోర్డు సమావేశం జరగనుండగా, వచ్చే వారం టాటా సన్స్ బోర్డు భేటీ కానుంది. ఈ సమావేశాల ఫలితాలు గ్రూప్ భవిష్యత్తును నిర్దేశించనున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ వివాదానికి ప్రధాన కారణం ఆర్‌బీఐ తీసుకున్న నిర్ణయమే. టాటా సన్స్‌ను 'అప్పర్ లేయర్' నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీగా (ఎన్‌బీఎఫ్‌సీ) వర్గీకరించడంతో నిబంధనల ప్రకారం కంపెనీని స్టాక్ మార్కెట్‌లో లిస్టింగ్ చేయడం తప్పనిసరి అయింది. అయితే, టాటా సన్స్‌లో 66% వాటాతో మెజారిటీ వాటాదారుగా ఉన్న టాటా ట్రస్టుల ఛైర్మన్ నోయెల్ టాటా, ఈ లిస్టింగ్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. లిస్టింగ్ వల్ల గ్రూప్ నియంత్రణను కోల్పోవడమే కాకుండా, లాభార్జనే ధ్యేయంగా మారి, దాతృత్వం అనే 'టాటా వే' దెబ్బతింటుందని ఆయన ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు, టాటా సన్స్ ఛైర్మన్ ఎన్. చంద్రశేఖరన్, ఇతర బోర్డు సభ్యులు మాత్రం ఆర్బీఐ నిబంధనలను పాటించాల్సిందేనని, లిస్టింగ్ ద్వారా కంపెనీలో పారదర్శకత పెరుగుతుందని వాదిస్తున్నారు. గత సెప్టెంబర్‌లో జరిగిన టాటా సన్స్ బోర్డు సమావేశంలో ఈ విభేదాలు తొలిసారి బయటపడ్డాయి. లిస్టింగ్ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలనే ప్రతిపాదనను, చంద్రశేఖరన్ పదవీకాలాన్ని మరో ఐదేళ్లు పొడిగించాలనే నిర్ణయాన్ని నోయెల్ టాటా వ్యతిరేకించినప్పటికీ, బోర్డు ఆయన అభ్యంతరాలను తోసిపుచ్చింది. అప్పటి నుంచి ఈ వివాదం బోర్డు గదుల నుంచి ట్రస్టుల స్థాయికి పాకింది. ట్రస్టుల్లోని సభ్యులైన వేణు శ్రీనివాసన్, విజయ్ సింగ్ వంటి వారు పాలనాపరమైన అంశాలపై నోయెల్ టాటాను ప్రశ్నిస్తూ, లిస్టింగ్‌కు మద్దతు పలుకుతున్నారు. మరోవైపు, నోయెల్ సవతి సోదరుడైన జిమ్మీ టాటా కూడా చంద్రశేఖరన్ నియామకాన్ని, లిస్టింగ్‌ను సమర్థించడం గమనార్హం. ఈ నేపథ్యంలో నేడు జరగనున్న టాటా ట్రస్టుల సమావేశం అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ భేటీలో ఆర్బీఐ నిబంధనలు, మహారాష్ట్ర ఛారిటీ కమిషనర్ విధించిన ఆంక్షలు, దాతృత్వ కార్యక్రమాల బడ్జెట్లపై చర్చించే అవకాశం ఉంది. అయితే, ఎలాంటి ఓటింగ్ జరగకపోవచ్చని, కేవలం ఇరు వర్గాలు తమ వాదనలను వినిపించుకునే వేదికగా ఇది మారుతుందని సమాచారం. లిస్టింగ్‌ను నివారించేందుకు నోయెల్ టాటా రెండు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నారు. మొదటిది.. టాటా ఎలక్ట్రానిక్స్, టాటా కన్సల్టింగ్ ఇంజనీర్స్‌ను టాటా సన్స్‌లో విలీనం చేసి, దానిని కేవలం హోల్డింగ్ కంపెనీగా కాకుండా "హోల్డింగ్-ఆపరేటింగ్ కంపెనీ"గా మార్చడం. దీనివల్ల లిస్టింగ్ నిబంధనల నుంచి మినహాయింపు లభించే అవకాశం ఉంది. రెండవది.. మైనారిటీ వాటాదారులైన షాపూర్‌జీ పల్లోంజీ గ్రూప్ తమ వాటాను దశలవారీగా విక్రయించేందుకు అనుమతించడం. అయితే, ఈ ప్రతిపాదనలకు బోర్డు, ఆర్బీఐ ఆమోదం తప్పనిసరి. ఈ అంతర్గత పోరు కారణంగా 185 బిలియన్ డాలర్ల ఆదాయాన్ని ఆర్జించే టాటా గ్రూప్‌లోని కొన్ని కీలక వ్యాపార కార్యకలాపాలు స్తంభించిపోయాయి. ఛారిటీ కమిషనర్ ఆంక్షలతో వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజీఎం) నిర్వహణ, డివిడెండ్ల చెల్లింపు వంటివి కూడా సంక్లిష్టంగా మారాయి. రాబోయే సమావేశాల్లో ఈ ప్రతిష్టంభనకు తెరపడుతుందో లేదోనని కార్పొరేట్ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది.

భారీ లాభాలతో ముగిసిన మార్కెట్లు..

25,800 దాటిన నిఫ్టీ



బ్యాంకింగ్, ఫైనాన్షియల్ షేర్లలో వెల్లువెత్తిన కొనుగోళ్ల మద్దతుతో దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం భారీ లాభాలతో ముగిశాయి. సెన్సెక్స్ ఏకంగా 897.96 పాయింట్లు (1.08 శాతం) ఎగబాకి 83,919.71 వద్ద స్థిరపడగా, నిఫ్టీ 286.30 పాయింట్లు (1.12 శాతం) పెరిగి కీలకమైన 25,800 మైలురాయిని అధిగమించి 25,800.60 వద్ద ముగిసింది. ప్రధానంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 3.47 శాతం లాభపడి మార్కెట్ ర్యాలీకి నాయకత్వం వహించింది. కోటక్ మహీంద్రా బ్యాంక్ 2.59 శాతం, ఐసీఐసీఐ బ్యాంక్ 2.16 శాతం, యాక్సిస్ బ్యాంక్ 2.12 శాతం చొప్పున రాణించాయి. దీంతో నిఫ్టీ ప్రైవేట్ బ్యాంక్ సూచీ 3.01 శాతం, నిఫ్టీ బ్యాంక్ 2.49 శాతం లాభపడ్డాయి. బజాజ్ ఫైనాన్స్, మారుతీ సుజుకీ, అల్ట్రాటెక్ సిమెంట్ షేర్లు కూడా సూచీల జోరుకు తోడయ్యాయి. మరోవైపు టైటాన్ (1.71 శాతం), టాటా స్టీల్ (1.69 శాతం), ఎన్‌టీపీసీ, హెచ్‌యూఎల్ షేర్లు నష్టాలతో ముగిశాయి. ప్రపంచ మార్కెట్ల బలహీన సంకేతాలు ఉన్నప్పటికీ, విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల (ఎఫ్ఐఐ) నిధుల ప్రవాహం, రూపాయి విలువ బలోపేతం కావడం, అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు తగ్గడం మార్కెట్లకు కలిసొచ్చాయి. నవంబరు నెలలోనే ఎఫ్ఐఐలు ఏకంగా 12 బిలియన్ డాలర్లకు పైగా పెట్టుబడులను భారత ఈక్విటీలలోకి తీసుకొచ్చారు.

ముగిసిన రెండో రోజు ఆట..

యశస్వి, కేఎల్ హాఫ్ సెంచరీలు.. భారత్ 159/1

ఇంటర్నెట్ డెస్క్: వెలింగ్టన్ వేదికగా జరుగుతోన్న తొలి టెస్టు రెండో రోజు ఆట ముగిసింది. కివీస్ బౌలింగ్‌కు భారత బ్యాటర్లు గట్టిగానే సమాధానం ఇస్తున్నారు. ఆట ముగిసే సమయానికి టీమ్‌ఇండియా 39 ఓవర్లలో వికెట్ నష్టానికి 159 పరుగులు చేసింది. క్రీజ్‌లో కేఎల్ రాహుల్ (52బి), దేవదత్ పడిక్కల్ (16బి) ఉన్నారు. అంతకుముందు యశస్వి జైస్వాల్ (85) కూడా అర్ధ శతకంతో జట్టుకు మంచి పునాది వేశాడు. కివీస్ బౌలర్ మ్యాట్ హెన్రీ ఒక వికెట్ పడగొట్టాడు. దీంతో భారత్ ఇంకా 209 పరుగుల వెనుకంజలో ఉంది. తొలి ఇన్నింగ్స్‌లో న్యూజిలాండ్ 368 పరుగులు చేసిన సంగతి తెలిసిందే.

సేనా దేశాల (సౌతాఫ్రికా, ఇంగ్లాండ్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా)పై ఓపెనర్‌గా వచ్చి 50+ స్కోర్లు చేసిన తొలి భారత ఆటగాడిగా కేఎల్ రాహుల్ నిలిచాడు. ఆసియాలో ఆరో బ్యాటర్. ఈ మ్యాచ్‌లో అతడు హాఫ్ సెంచరీ సాధించాడు. కివీస్‌పై అతడికిదే తొలి అర్ధ శతకం కావడం గమనార్హం.

న్యూజిలాండ్‌పై తొలి వికెట్‌కు యశస్వి - కేఎల్ రాహుల్ 130 పరుగులు జోడించారు. ఇది రెండో అత్యధిక భాగస్వామ్యం. కివీస్ గడ్డపై 32 ఏళ్ల తర్వాత ఓపెనింగ్‌లో శతకం పార్టనర్‌షిప్ వచ్చింది.

కివీస్ గడ్డపై 2016 తర్వాత ఆతిథ్య జట్టు ఓపెనర్లు హాఫ్ సెంచరీలు చేయడం ఇదే తొలిసారి.

టీ బ్రేక్ తర్వాత.. మూడో సెషన్‌లో కివీస్ బౌలర్లు ఆరు నోబాల్స్ విసిరారు. 2009లో నుంచి ఒక సెషన్‌లో అత్యధిక నోబాల్స్ వేయడం ఇది రెండోసారి. గతేడాది ఇంగ్లాండ్‌పైనా సరిగ్గా ఆరు వేశారు.

న్యూజిలాండ్‌తో తొలి టెస్టులో టీమ్‌ఇండియా ఓపెనర్ కేఎల్ రాహుల్ (50బి) హాఫ్ సెంచరీ నమోదు చేశాడు. 99 బంతుల్లో అర్ధ శతకం పూర్తి చేశాడు. కెరీర్‌లో అతడికిది 22వ హాఫ్ సెంచరీ. యశస్వి జైస్వాల్ ఔటైన తర్వాత బ్యాటింగ్‌కు వచ్చిన దేవదత్ పడిక్కల్ (5బి)తో కలిసి కేఎల్ నెమ్మదిగా ఆడుతున్నాడు. మ్యాట్ హెన్రీ, జేమీసన్ కట్టుదిట్టంగా బంతులేయడంతో భారత బ్యాటర్లు ఆచితూచి ఆడారు. ప్రస్తుతం టీమ్‌ఇండియా స్కోరు 34 ఓవర్లకు 143/1. కివీస్ కంటే భారత్ ఇంకా 225 పరుగులు వెనుకబడి ఉంది.

భారత్ తొలి వికెట్‌ను కోల్పోయింది. యశస్వి జైస్వాల్ (85: 89 బంతుల్లో 16 ఫోర్లు) పెవిలియన్‌కు చేరాడు. మ్యాట్ హెన్రీ బౌలింగ్‌లో (27.5వ ఓవర్) వికెట్ కీపర్‌కు క్యాచ్ ఇచ్చాడు. తొలుత అంపైర్ నాటౌట్ ఇవ్వగా.. కివీస్ డీఆర్ఎస్ తీసుకుంది. సమీక్షలో బ్యాట్‌ను బంతి తాకినట్లు తేలడంతో యశస్వి నిరాశగా డగౌట్ బాట పట్టాడు. దీంతో సెంచరీ చేసే అవకాశాన్ని చేజార్చుకున్నాడు. ప్రస్తుతం భారత్ 28 ఓవర్లకు 130/1 స్కోరు చేసింది. క్రీజ్‌లో కేఎల్ రాహుల్ (42బి), దేవదత్ పడిక్కల్ ఉన్నారు. టీమ్‌ఇండియా ఇంకా 238 పరుగులు వెనుకబడి ఉంది. కివీస్ తొలి ఇన్నింగ్స్‌లో 368 రన్స్ చేసిన సంగతి తెలిసిందే.



యశస్వి హాఫ్ సెంచరీ

యువ బ్యాటర్ యశస్వి జైస్వాల్ హాఫ్ సెంచరీ సాధించాడు. 66 బంతుల్లో అర్ధ శతకం నమోదు చేశాడు. జాకబ్ డఫీ (22.1వ ఓవర్) బంతిని స్ట్రెయిట్ డ్రైవ్‌తో ఫోర్‌గా మలిచి హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఈ ఓవర్‌లో మూడు ఫోర్లను కొట్టాడు. ఆరంభంలో ఆచితూచి ఆడిన అతడు బ్యాట్‌ను ఝళిపించాడు. ప్రస్తుతం టీమ్‌ఇండియా స్కోరు 23 ఓవర్లకు 97/0. క్రీజ్‌లో యశస్వి (58బి), కేఎల్ రాహుల్ (36బి) ఉన్నారు. అంతకుముందు తొలి ఇన్నింగ్స్‌లో కివీస్ 368 పరుగులు చేసింది.

భారత ఓపెనర్లు యశస్వి జైస్వాల్ (28బి), కేఎల్ రాహుల్ (25బి) శుభారంభం అందించారు. తొలి వికెట్‌కు అర్ధ శతక భాగస్వామ్యం నిర్మించారు. కివీస్ పేస్‌ను సమర్థంగా అడ్డుకుంటూ పరుగులు రాబడుతున్నారు. ప్రస్తుతం భారత్ స్కోరు 15 ఓవర్లకు 53/0.

వెలింగ్టన్ వేదికగా జరుగుతోన్న తొలి టెస్టులో భారత్ మొదటి ఇన్నింగ్స్‌ను మొదలుపెట్టింది. రెండో రోజు టీ బ్రేక్ సమయానికి వికెట్ నష్టపోకుండా 8 ఓవర్లలో 16 పరుగులు చేసింది. క్రీజ్‌లో యశస్వి జైస్వాల్ (11బి), కేఎల్ రాహుల్ (5బి) ఉన్నారు. పిచ్ నుంచి పేసర్లకు కాస్త సహకారం లభించడంతో కివీస్ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేశారు. టీమ్‌ఇండియా ఓపెనర్లు మాత్రం ఎలాంటి రిస్క్ తీసుకోకుండా నిలకడగా ఆడుతున్నారు. అంతకుముందు తొలి ఇన్నింగ్స్‌లో న్యూజిలాండ్ 368 పరుగులకు ఆలౌటైన సంగతి తెలిసిందే.

స్పోర్ట్స్

పంజాబ్ కింగ్స్‌లోకి హార్దిక్ పాండ్యా ఎంట్రీ..

అసలు వ్యూహం బయటపెట్టిన రికీ పాంటింగ్!

భారీ ట్రేడ్ ద్వారా హార్దిక్ పాండ్యాను సొంతం చేసుకున్న పంజాబ్ కింగ్స్

హార్దిక్‌కు బదులుగా పేసర్ అర్ష్‌దీప్ సింగ్‌ను బదిలీ చేసిన పంజాబ్ ఫ్రాంచైజీ

హార్దిక్ చేరికతో జట్టు సమతూకంగా మారిందన్న పంజాబ్ కోచ్ రికీ పాంటింగ్

అవసరమైన అన్ని స్థానాలను పటిష్ఠం చేసుకున్నామని వ్యాఖ్య



ఐపీఎల్ 2027 కోసం 19 మందిని రీటైన్ చేసుకుని, ఆరుగురిని రిలీజ్ చేసిన పంజాబ్ భారత స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా రాకతో ఐపీఎల్ 2027 సీజన్ కోసం పంజాబ్ కింగ్స్ జట్టు సమతూకంగా మారిందని ఆ జట్టు ప్రధాన కోచ్ రికీ పాంటింగ్ అభిప్రాయపడ్డాడు. వేలానికి ముందే ఎడమచేతి వాటం పేసర్ అర్ష్‌దీప్ సింగ్‌ను ఇచ్చి, భారీ ట్రేడింగ్ ద్వారా హార్దిక్‌ను పంజాబ్ తమ గూటికి చేర్చుకుంది. పేస్, స్పిన్ విభాగాల్లో నాణ్యమైన ఆల్‌రౌండర్ల బలం తమకు కలిసొచ్చే అంశమని పాంటింగ్ తెలిపాడు. రాబోయే సీజన్ కోసం తాము కేవలం ఆరుగురు ఆటగాళ్లను మాత్రమే విడుదల చేసి, 19 మందిని రీటైన్ చేసుకున్నట్లు పాంటింగ్ వెల్లడించాడు. "హార్దిక్ రాకతో పాటు ఇప్పటికే జట్టులో ఉన్న మార్కో జాన్సెన్, మార్కస్ స్టోయినిస్, అజ్మతుల్లా, శశాంక్, సూర్యాంశ్ షెడ్గే, కూపర్ కానోలీ వంటి ఆల్‌రౌండర్లు ఉన్నారు. ఫాస్ట్ బౌలింగ్, స్పిన్ బౌలింగ్ విభాగాల్లో అవసరమైన అన్ని స్థానాలను భర్తీ చేసుకున్నాం. డిసెంబరు 16న గోవాలో జరిగే వేలంలో మా ప్రధాన లక్ష్యం తుది జట్టును మరింత పటిష్ఠం చేసుకోవడమే. ఆ తర్వాత భవిష్యత్తు కోసం ప్రతిభావంతులైన యువ భారత ఆటగాళ్లను ఎంపిక చేయడంపై దృష్టి పెడతాం" అని పాంటింగ్ తెలిపాడు. మరోవైపు లక్నో సూపర్ జెయింట్స్ నుంచి వెటరన్ పేసర్ మహమ్మద్ షమీని రాజస్థాన్ రాయల్స్ ట్రేడ్ ద్వారా దక్కించుకుంది. సంజూ శాంసన్ జట్టును వీడిన తర్వాత ఏర్పడిన లోటును భర్తీ చేసేందుకు నిరంతరం ప్రయత్నిస్తున్నామని రాజస్థాన్ రాయల్స్ హెడ్ కోచ్ కుమార్ సంగక్కర చెప్పాడు. ఇప్పటికే రవీంద్ర జడేజా, సామ్ కరన్, డొనొవన్ ఫెరీరా వంటి ఆటగాళ్లను ట్రేడ్ ద్వారా తీసుకున్నామని, జట్టు ప్రధాన బలం అలాగే ఉందని ఆయన పేర్కొన్నాడు. ఇక వెస్టిండీస్ హిట్టర్ షిమ్రాన్ హెట్‌మయర్ భిన్నమైన బ్యాటింగ్ స్థానాన్ని కోరుకోవడంతో పాటు, వేలంలో పర్స్ వాల్యూ పెంచుకునేందుకే అతడిని విడుదల చేయాల్సి వచ్చిందని సంగక్కర వివరించాడు.

సంపాదకీయం


ఆసియాలో కొత్తవ్యూహాలు!

ప్రపంచ రాజకీయాలు, ఆర్థిక వ్యవస్థలు ప్రస్తుతం అనూహ్యమైన మలుపులు తిరుగుతున్నాయి. ఒకవైపు అమెరికా, చైనా, రష్యా వంటి అగ్రరాజ్యాల మధ్య అధిపత్య పోరు కొనసాగుతుంటే.. మరోవైపు పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ వాతావరణం అంతర్జాతీయ వాణిజ్యం, ఇంధన భద్రతను ప్రభావితం చేస్తోంది. ముఖ్యంగా ఇరాన్ చుట్టూ నెలకొన్న ఉద్రిక్తతలు, హార్మూజ్ జలసంధి దిగ్బంధం, గల్ఫ్ ప్రాంతంలో దాడులు ఆసియా దేశాలను అందోళనకు గురిచేస్తున్నాయి. ఇంధన దిగుమతులపై అధారపడే భారత్‌కు ఇది మరింత సున్నితమైన అంశం. ఈ నేపథ్యంలో ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాలో నవంబర్ 16, 17 తేదీల్లో జరిగిన ఆసియాన్-భారత్ శిఖరాగ్ర సమావేశం, తూర్పు ఆసియా సదస్సు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఆసియాన్‌లోని 11 సభ్య దేశాలతో భారత్ సంబంధాలు కేవలం వాణిజ్యానికి మాత్రమే పరిమితం కావడం లేదు. సముద్ర భద్రత, రవాణా మార్గాలు, సాంకేతిక పరిజ్ఞానం, విపత్తుల నిర్వహణ, సైబర్ నేరాల నియంత్రణ వంటి అంశాల్లోనూ పరస్పర సహకారం అవసరమవుతోంది. ఈ సమావేశాల్లో ప్రధాని నరేంద్ర మోదీ ప్రపంచానికి శాంతి, స్థిరత్వం, అంచనా వేయగలిగే పరిస్థితులు అవసరమని స్పష్టం చేయడం ప్రస్తుత అంతర్జాతీయ వాతావరణానికి అనుగుణంగా ఉంది. ఆసియాన్ దేశాల పర్యాటకులకు ఉచిత ఈ-వీసాలు అందించనున్నట్లు భారత్ ప్రకటించడం ప్రజల మధ్య సంబంధాలు, పర్యాటకం, వ్యాపార అవకాశాలకు ఊతమిచ్చే నిర్ణయం. అలాగే సముద్ర సహకారానికి దీర్ఘకాలిక కార్యాచరణ ప్రణాళిక, సైబర్ ఫోరెన్సిక్స్ శిక్షణ, అణుశక్తి, అంతరిక్షం, కీలక ఖనిజాలు, యువత మార్పిడి కార్యక్రమాలపై ప్రతిపాదనలు చేయడం ద్వారా సంబంధాలను విస్తృతం చేసే ప్రయత్నం జరిగింది.

భారత్ విదేశాంగ విధానంలో ఆసియాన్‌కు ఉన్న ప్రాధాన్యాన్ని అర్థం చేసుకోవాలంటే ఇండో-పసిఫిక్ ప్రాంత భౌగోళిక, వ్యూహాత్మక పరిస్థితులను గమనించాలి. హిందూ మహాసముద్రం నుంచి పసిఫిక్ మహాసముద్రం వరకు విస్తరించిన ఈ ప్రాంతం ప్రపంచ వాణిజ్యానికి కీలకమైన సముద్ర మార్గాలను కలుపుతోంది. ఈ మార్గాలపై స్వేచ్ఛాయుత రాకపోకలు, అంతర్జాతీయ నిబంధనల అమలు, సముద్ర భద్రత ప్రతి దేశానికీ అవసరం. దక్షిణ చైనా సముద్రంలో చైనా అధిపత్య ప్రయత్నాలపై కొన్ని దేశాలకు అందోళనలు ఉండగా, అమెరికా తన వ్యూహాత్మక ప్రయోజనాలను కాపాడుకునేందుకు ప్రాంతీయ భాగస్వామ్యాలను బలోపేతం చేస్తోంది. ఈ పరిస్థితుల్లో భారత్ ఒకవైపు ఆసియాన్ కేంద్రతను గౌరవిస్తూనే, మరోవైపు అమెరికా, జపాన్, ఆస్ట్రేలియాలతో కూడిన క్వాడ్ భాగస్వామ్యంలోనూ చురుగ్గా వ్యవహరిస్తోంది. మనీలాలో నవంబర్ 17న జరిగిన క్వాడ్ నేతల సమావేశం ఈ దిశగా మరో ముందడుగు. రెండేళ్ల విరామం తర్వాత జరిగిన సమావేశంలో ప్రధాని మోదీతోపాటు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఆస్ట్రేలియా ప్రధాని అంథోనీ అల్బనీస్, జపాన్ ప్రధాని సనే తకాయిచీ పాల్గొన్నారు. 2027లో ముంబయిలో క్వాడ్ బిజినెస్ లీడర్స్ ఫోరమ్ నిర్వహించాలని నిర్ణయించడం భారత్‌కు ఆర్థిక, వాణిజ్య పరంగా ప్రాధాన్యమైన పరిణామం. ఇండో-పసిఫిక్ సముద్ర ప్రాంతంలో నిఘా, సమాచార మార్పిడిని పెంచేందుకు కొత్త సహకార కార్యక్రమాన్ని ప్రకటించారు. 2027లో తొలిసారిగా క్వాడ్ దేశాల గస్తీ విమానాలు ఉమ్మడి సముద్ర విన్యాసంలో పాల్గొననున్నాయి. అయితే క్వాడ్ అనేది సైనిక కూటమి కాదని, ప్రాంతీయ ప్రయోజనాల కోసం ఏర్పడిన వ్యూహాత్మక సహకార వేదిక అని భారత్ తన వైఖరిలో స్పష్టం చేస్తూ వస్తోంది. చైనాను లక్ష్యంగా చేసుకున్న కూటమిగా దీనిని మార్చకుండా, సముద్ర భద్రత, సాంకేతిక సహకారం, విపత్తుల నిర్వహణ, వాణిజ్య సంబంధాలపై దృష్టి నిలపడం భారత్‌కు అవసరం. అదే సమయంలో ఫిలిప్పీన్స్‌తో ద్వైపాక్షిక సంబంధాలూ కొత్త దశలోకి ప్రవేశించాయి. 2025 ఆగస్టులో అధ్యక్షుడు ఫెర్డినాండ్ మార్కోస్ భారత్ పర్యటన సందర్భంగా ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం ఏర్పడింది. రక్షణ, సముద్ర భద్రత, వాణిజ్యం, సాంకేతిక రంగాల్లో సహకారం పెరుగుతోంది. ఫిలిప్పీన్స్‌కు బ్రహ్మోస్ క్షిపణి వ్యవస్థల సరఫరా కూడా ఈ సంబంధాల్లో కీలక అంశంగా నిలుస్తోంది. అయితే మనీలా సదస్సుల కంటే ఎక్కువగా అంతర్జాతీయ దృష్టిని ఆకర్షించింది చైనాలోని షెన్‌జెన్‌లో నవంబర్ 20న జరిగిన అమెరికా, రష్యా, చైనా అధినేతల త్రైపాక్షిక సమావేశం. డొనాల్డ్ ట్రంప్, వ్లాదిమిర్ పుతిన్, షీ జిన్‌పింగ్ ఒకే వేదికపై సమావేశం కావడం అంతర్జాతీయ దౌత్యంలో అరుదైన పరిణామం. అణు యుద్ధం జరగకూడదన్న సూత్రాన్ని పునరుద్ఘాటిస్తూ, అణు ప్రమాదాలను తగ్గించేందుకు చర్చలు జరపాలని నేతలు అంగీకరించినట్లు తాజా నివేదికలు వెల్లడించాయి. అయితే ఇరాన్ సంక్షోభం, ఉక్రెయిన్ యుద్ధం, తైవాన్ సమస్య, వాణిజ్య వివాదాలు వంటి కీలక అంశాలపై స్పష్టమైన పరిష్కారాలు వెలువడలేదు. ఈ సమావేశం ఫలితాలపై ప్రపంచ దేశాలు ఆసక్తిగా దృష్టి సారించడానికి ఇదే కారణం.

మూడు అగ్రరాజ్యాల మధ్య ఏకాభిప్రాయం కుదిరితే ప్రపంచ రాజకీయాలు, వాణిజ్యం, భద్రతపై ప్రభావం పడుతుంది. అదే సమయంలో వాటి మధ్య విభేదాలు మరింత తీవ్రమైతే చిన్న, మధ్యస్థాయి దేశాలు తమ విదేశాంగ విధానాలను కొత్తగా సమీక్షించుకోవాల్సి వస్తుంది. భారత్‌కు ఈ పరిణామం మరింత ప్రాధాన్యమైనది. అమెరికాతో రక్షణ, సాంకేతిక, వాణిజ్య సంబంధాలను బలోపేతం చేసుకుంటూనే రష్యాతో సంప్రదాయ స్నేహాన్ని కొనసాగించాల్సి ఉంది. చైనాతో సరిహద్దు సమస్యలు, వాణిజ్య అసమతుల్యత వంటి అంశాలున్నప్పటికీ దౌత్య సంబంధాలకు తలుపులు మూసివేయలేని పరిస్థితి. అందుకే ఏ ఒక్క శక్తి కూటమికి పూర్తిగా కట్టుబడకుండా, జాతీయ ప్రయోజనాలకు అనుగుణంగా స్వతంత్ర నిర్ణయాలు తీసుకునే వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని భారత్ కాపాడుకోవాలి. ఆసియాన్‌తో సంబంధాలు, క్వాడ్ సహకారం, గల్ఫ్ దేశాలతో ఇంధన భాగస్వామ్యం, రష్యా-అమెరికా-చైనాలతో సమతుల్య దౌత్యం.. ఇవన్నీ పరస్పరం అనుసంధానమైన అంశాలే. ప్రపంచం కొత్త శక్తి సమీకరణాల దిశగా అడుగులు వేస్తున్న వేళ భారత్ ముందున్న అసలు సవాలు కేవలం అంతర్జాతీయ వేదికలపై తన ఉనికిని చాటుకోవడం కాదు. ఆ దౌత్యాన్ని దేశ భద్రత, ఇంధన అవసరాలు, ఆర్థిక వృద్ధి, సాంకేతిక పురోగతికి ఉపయోగపడేలా మలచుకోవడం. ప్రకటనలతో పాటు ఆచరణలోనూ భాగస్వామ్యాలు బలపడినప్పుడే భారత్ ఇండో-పసిఫిక్‌లో విశ్వసనీయ శక్తిగా మరింత విస్తరించగలదు!

పనికొచ్చే పలుకు



మన చేతుల్లో లేకుంటే ..వదిలేద్దాం!

జీవితంలో మనల్ని నిరాశకు గురిచేసే సందర్భాలు ఎన్నో ఎదురవుతుంటాయి. కొందరి మాటలు మనసును గాయపరుస్తాయి. కొన్ని పరిస్థితులు మనం ఎంత ప్రయత్నించినా అనుకూలంగా మారవు. మరికొన్ని సంఘటనలు మన ప్రమేయం లేకుండానే జరుగుతుంటాయి. అయితే ఇలాంటి ప్రతి విషయాన్నీ మనసుకు తీసుకుని, పదేపదే ఆలోచిస్తూ బాధపడటం వల్ల సమస్య పరిష్కారం కాకపోగా.. మన ప్రశాంతత మాత్రం దూరమవుతుంది. అందుకే మనల్ని నిరాశకు గురిచేసే ప్రతి సందర్భంలోనూ ముందుగా మనల్ని మనం ఒక ప్రశ్న వేసుకోవాలి. 'ఈ పరిస్థితిని నేను మార్చగలనా?' అని ఆలోచించాలి. ఈ ఒక్క ప్రశ్న మన ఆలోచనా విధానాన్ని, జీవనశైలిని మార్చగలదు.

ఒకవేళ ఆ పరిస్థితి మన నియంత్రణలో లేదని అర్థమైతే.. దాన్ని మార్చాలని పదేపదే ప్రయత్నిస్తూ మనసును అలసటకు గురిచేయకూడదు. ఇతరుల ఆలోచనలు, అభిప్రాయాలు, గతంలో జరిగిన సంఘటనలు, మన ప్రమేయం లేకుండా ఎదురయ్యే కొన్ని సమస్యలు మన చేతుల్లో ఉండవు. అలాంటప్పుడు వాటిని అంగీకరించడం బలహీనత కాదు.. అది ఒక పరిణతితో కూడిన నిర్ణయం. అంగీకరించడం అంటే సమస్యను సమర్థించడం కాదు. దాని వల్ల కలిగిన బాధను లేదనుకోవడం అంతకంటే కాదు. మన శక్తి సామర్థ్యాలను వృథా చేయకుండా, ముందుకు సాగేందుకు మనసును సిద్ధం చేసుకోవడమే. ఉదాహరణకు, గతంలో ఎవరో మనల్ని అవమానించారనుకోండి. ఆ సంఘటనను పదేపదే గుర్తుచేసుకుంటూ బాధపడితే మన ప్రస్తుత సమయం కూడా చేజారిపోతుంది. కానీ ఆ అనుభవం నుంచి ఒక పాఠం నేర్చుకుని, దాన్ని అక్కడితో వదిలేయగలిగితే మనసుకు ఎంతో ప్రశాంతత లభిస్తుంది. గతాన్ని మార్చలేమని, కానీ దాని గురించి మనం ఎలా ఆలోచించాలో నిర్ణయించుకోగలమని గుర్తించాలి.

అదే సమయంలో, మనం మార్చగలిగే పరిస్థితుల విషయంలో నిర్లక్ష్యంగా ఉండకూడదు. ఉద్యోగంలో సమస్య ఉందా? సంబంధాల్లో అపార్థాలు ఉన్నాయా? ఆరోగ్యం పట్ల శ్రద్ధ తగ్గిందా? ఆర్థిక క్రమశిక్షణ లోపించిందా? వీటిని మార్చే అవకాశం మన చేతుల్లోనే ఉంటుంది. అలాంటప్పుడు బాధపడుతూ కూర్చోవడం కంటే పరిష్కారం దిశగా చిన్న అడుగు వేయడం మంచిది. అవసరమైతే తప్పును అంగీకరించాలి. మాట్లాడాల్సిన వారితో మాట్లాడాలి. మార్చుకోవాల్సిన అలవాట్లను మార్చుకోవాలి. సమస్యను ఒక్కసారిగా పరిష్కరించలేకపోయినా, ప్రతిరోజూ చేసే చిన్న ప్రయత్నాలు క్రమంగా మార్పును తీసుకొస్తాయి. మన జీవితంలో ప్రశాంతత అనేది అన్ని సమస్యలూ తొలగిపోయినప్పుడు మాత్రమే లభించేది కాదు. ఏది మన చేతుల్లో ఉంది, ఏది మన చేతుల్లో లేదు అనే స్పష్టత వచ్చినప్పుడే అది మొదలవుతుంది. కాబట్టి ప్రతికూల పరిస్థితులు ఎదురైనప్పుడు ఆందోళనకు లోనుకాకుండా కాసేపు ఆగి ఆలోచించండి. మార్చగలిగితే మార్చండి.. మార్చలేకపోతే అంగీకరించి ముందుకు సాగండి. ఎందుకంటే మన శక్తిని సమస్యల గురించి ఆలోచించడానికే ఖర్చు చేస్తే, పరిష్కారాల కోసం మిగిలేది ఏమీ ఉండదు. మన ప్రశాంతతను కాపాడుకోవడం కూడా మనం అలవరచుకోవాల్సిన ఒక ముఖ్యమైన జీవన నైపుణ్యమే!

పారిశ్రామిక రంగంలో 'రోబో' శకం!


మనిషి చేసే పనులను మనిషి రూపంలోని యంత్రాలే నిర్వహించే రోజులు దగ్గరపడుతున్నాయి. కృత్రిమ మేధస్సు అండతో హ్యూమనాయిడ్ రోబోలు పారిశ్రామిక రంగంలో సరికొత్త విప్లవానికి తెరతీస్తున్నాయి. అమెరికాలో 2030 నాటికి వీటి ఉత్పత్తి 4 లక్షల యూనిట్లకు చేరుతుందన్న అంచనాలు ఈ మార్పు వేగాన్ని సూచిస్తున్నాయి. భవిష్యత్తులో పరిశ్రమల రూపురేఖలను మార్చబోతున్న ఈ రోబో శకం ఉద్యోగాలపై ఎలాంటి ప్రభావం చూపనుందన్నది ఆసక్తికరంగా మారింది.



మనిషి సృష్టించిన యంత్రాలు ఇప్పుడు మనిషి రూపాన్నే సంతరించుకుంటున్నాయి. ఒకప్పుడు సైన్స్ ఫిక్షన్ సినిమాల్లో మాత్రమే కనిపించిన హ్యూమనాయిడ్ రోబోలు ఇప్పుడు వాస్తవ ప్రపంచంలోకి వేగంగా ప్రవేశిస్తున్నాయి. కేవలం ప్రదర్శనలకే పరిమితం కాకుండా, మనుషులు చేసే పనులను నిర్వహించే కృత్రిమ మేధస్సు ఆధారిత యంత్రాలుగా రూపాంతరం చెందుతున్నాయి. తయారీ, లాజిస్టిక్స్, గిడ్డంగులు వంటి రంగాల్లో వీటి వినియోగానికి అవకాశాలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రముఖ ఆర్థిక సేవల సంస్థ జేపీ మోర్గాన్ కీలక అంచనాలను వెల్లడించింది. 2030 నాటికి అమెరికాలో హ్యూమనాయిడ్ రోబోల ఉత్పత్తి 3 లక్షల నుంచి 4 లక్షల యూనిట్లకు చేరవచ్చని, 2035 నాటికి ఈ సంఖ్య 15 లక్షల యూనిట్లకు పెరగవచ్చని పేర్కొంది. ఈ అంచనాలు నిజమైతే ప్రపంచ రోబోటిక్స్ పరిశ్రమలో అమెరికా కీలక కేంద్రంగా ఎదిగే అవకాశం ఉంది. ఈ సాంకేతికతకు ప్రధాన కారణం పారిశ్రామిక రంగంలో పెరుగుతున్న కార్మికుల కొరత. ముఖ్యంగా పునరావృతమయ్యే పనులు, శారీరక శ్రమ ఎక్కువగా అవసరమయ్యే విధులను నిర్వహించేందుకు కంపెనీలు ప్రత్యామ్నాయాలను అన్వేషిస్తున్నాయి. మనిషి ఆకారంలో ఉండే రోబోలు మెట్లు ఎక్కడం, వస్తువులను పట్టుకోవడం, వనిముట్లను ఉపయోగించడం వంటి కార్యకలాపాలకు అనుగుణంగా రూపొందించబడుతున్నాయి. దీనివల్ల ప్రతి పనికీ ప్రత్యేకమైన యంత్రాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం తగ్గుతుంది. కృత్రిమ మేధస్సు, సెన్సార్లు, కంప్యూటర్ విజన్‌వంటి సాంకేతికతల సమన్వయంతో రోబోలు పరిసరాలను గుర్తించడం, వస్తువులను ఎంచుకోవడం, పరిస్థితులకు అనుగుణంగా స్పందించడం నేర్చుకుంటున్నాయి. ఈ పరిణామాన్నే 'ఫిజికల్ ఏఐ'గా వ్యవహరిస్తున్నారు. అంటే డిజిటల్ ప్రపంచంలో సమాచారాన్ని విశ్లేషించే ఏఐ ఇప్పుడు భౌతిక ప్రపంచంలో పనులు చేసే స్థాయికి చేరుకుంటోంది. ఇది పారిశ్రామిక రంగంలో కీలకమైన మార్పునకు నాంది పలుకుతోంది.

ఈ రంగంలో టెస్లా, ఎజిలిటీ రోబోటిక్స్, బోస్టన్ డైనమిక్స్, ఫిగర్ ఏఐ, ఆప్టోనిక్ వంటి సంస్థలు ముందంజలో ఉన్నాయి. టెస్లా రూపొందిస్తున్న 'ఆప్టిమస్', ఎజిలిటీ రోబోటిక్స్ 'డిజిట్', బోస్టన్ డైనమిక్స్ 'అట్లాస్', ఫిగర్ ఏఐ 'ఫిగర్', ఆప్టోనిక్ 'అపోలో' రోబోలు ప్రత్యేక గుర్తింపు పొందుతున్నాయి. వీటిని కర్మాగారాలు, గిడ్డంగులు, ఇతర పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేస్తున్నారు. ఇప్పటికే కొన్ని సంస్థలు వాస్తవ పరిశ్రమల్లో రోబోలను ప్రయోగాత్మకంగా వినియోగిస్తున్నాయి. ముఖ్యంగా వస్తువులను తరలించడం, విడిభాగాలను ఒకచోట నుంచి మరోచోటికి చేర్చడం వంటి పనుల్లో వీటి సామర్థ్యాన్ని పరీక్షిస్తున్నాయి. జేపీ మోర్గాన్ అంచనా ప్రకారం హ్యూమనాయిడ్ రోబోల వినియోగం పెరిగితే కంపెనీల నిర్వహణ వ్యయాలు గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. ఒక రోబోను బహుళ షిఫ్టుల్లో వినియోగించడం ద్వారా ఒక్కో వినియోగదారుడికి ఏడాదికి సుమారు లక్ష డాలర్ల వరకు ఆదా కావచ్చని సంస్థ పేర్కొంది. అయితే ఈ ప్రయోజనం రోబో ధర, నిర్వహణ వ్యయం, వనితీరు వంటి అంశాలపై ఆధారపడి ఉంటుంది. మరోవైపు ఈ రంగంలో అనేక సవాళ్లు కూడా ఉన్నాయి. రోబోల చేతులు, యాక్యుయేటర్లు, మోటార్లు, బ్యాటరీ సామర్థ్యం, ఏఐ శిక్షణకు అవసరమైన డేటా, కంప్యూటింగ్ సామర్థ్యం వంటి అంశాలు ప్రధాన అవరోధాలుగా ఉన్నాయి. మనిషి చేతుల మాదిరిగా సున్నితమైన వస్తువులను పట్టుకోవడం, క్లిష్టమైన పనులను కచ్చితత్వంతో నిర్వహించడం ఇంకా సవాలుగానే ఉంది. అందుకే రోబోల తయారీతో పాటు వాటికి అవసరమైన విడిభాగాల మార్కెట్‌వైనా భారీ అంచనాలు ఏర్పడ్డాయి. యాక్యుయేటర్లు, మోటార్లు, విజన్ సిస్టమ్స్ వంటి కీలక విడిభాగాల మార్కెట్ 2035 నాటికి 30 బిలియన్ డాలర్లకు చేరవచ్చని జేపీ మోర్గాన్ అంచనా వేసింది. టిమ్మెన్, రోబోటిస్, లీడర్ డ్రైవ్, ఓర్బెక్, కాగ్నెక్స్ వంటి సంస్థలకు ఈ పరిణామం వ్యాపార అవకాశాలను పెంచనుంది. అమెరికా ప్రభుత్వం కూడా విదేశీ దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించి, దేశీయ రోబోటిక్స్ తయారీని ప్రోత్సహించే దిశగా చర్యలు తీసుకునే అవకాశం ఉంది. జాతీయ భద్రత, పారిశ్రామిక స్వావలంబన వంటి అంశాలు ఈ వ్యూహానికి ప్రాధాన్యం కల్పిస్తున్నాయి.

అయితే హ్యూమనాయిడ్ రోబోల విస్తరణతో మరో కీలకమైన ప్రశ్న తెరపైకి వస్తోంది. అదే ఉద్యోగాల భవిష్యత్తు. రాబోయే రోజుల్లో రోబోలు మనుషుల ఉపాధి అవకాశాలను దెబ్బతీస్తాయా? అనే ఆందోళన సహజంగానే వ్యక్తమవుతోంది. ముఖ్యంగా ఒకే తరహా పనులను గంటల తరబడి చేసే ఉద్యోగాల్లో మానవుల స్థానాన్ని రోబోలు భర్తీ చేసే అవకాశం ఉంది. అయితే మరోవైపు రోబోల తయారీ, ప్రోగ్రామింగ్, నిర్వహణ, మరమ్మతులు, శిక్షణ వంటి కొత్త రంగాల్లో ఉద్యోగాలు కూడా ఏర్పడవచ్చు. అందువల్ల ఈ మార్పును కేవలం ఉద్యోగాల కోతగా కాకుండా, ఉపాధి స్వరూపంలో వస్తున్న పరిణామంగా చూడాల్సి ఉంటుంది. కార్మికులకు కొత్త సాంకేతిక నైపుణ్యాలు నేర్పించడం, విద్యా వ్యవస్థలో ఏఐ, రోబోటిక్స్‌కు ప్రాధాన్యం ఇవ్వడం కీలకం కానుంది. భారత్‌కు కూడా ఈ రంగంలో మంచి అవకాశాలు ఉన్నాయి. ఆటోమొబైల్ విడిభాగాలు, ఎలక్ట్రానిక్స్, మోటార్లు, సెన్సార్లు, సాఫ్ట్‌వేర్ రంగాల్లో ఉన్న నైపుణ్యాన్ని ఉపయోగించుకుని ప్రపంచ రోబోటిక్స్ సరఫరా వ్యవస్థలో కీలక భాగస్వామిగా ఎదగవచ్చు. ఇందుకు పరిశోధన, అభివృద్ధి, తయారీ మౌలిక సదుపాయాలపై పెట్టుబడులు అవసరం. భవిష్యత్తులో హ్యూమనాయిడ్ రోబోలు కర్మాగారాలకే పరిమితం కాకుండా ఆసుపత్రులు, వృద్ధుల సంరక్షణ, విపత్తు నిర్వహణ, గృహ సేవలు వంటి రంగాల్లోనూ ప్రవేశించే అవకాశం ఉంది. అయితే ప్రతి పనికీ మనిషి ఆకారంలోని రోబోనే సరైన పరిష్కారం కాదు. కొన్ని సందర్భాల్లో సాధారణ ఆటోమేటెడ్ యంత్రాలే తక్కువ ఖర్చుతో మెరుగైన ఫలితాలను ఇవ్వవచ్చు. కాబట్టి అవసరానికి అనుగుణంగా సాంకేతికతను వినియోగించుకోవడమే సరైన మార్గం. మొత్తంగా హ్యూమనాయిడ్ రోబోల రంగం మరో పారిశ్రామిక విప్లవానికి నాంది పలుకుతోంది. ఈ మార్పులో మనిషి స్థానాన్ని యంత్రాలు పూర్తిగా ఆక్రమిస్తాయా? లేక మనిషి సామర్థ్యాలను మరింత విస్తరించే సహాయకులుగా మారతాయా? అన్నది రాబోయే దశాబ్దంలో తేలనుంది. ■



చిన్నప్పుడు మీకు ఎంతో ఇష్టమైన పనులు గుర్తున్నాయా? బొమ్మలు గీయడం, సైకిల్ తొక్కడం, పాటలు పాడటం, నచ్చిన ఆటలు ఆడటం.. ఇలా ఏదో ఒకటి మీ మనసుకు ఆనందాన్ని ఇచ్చే ఉంటుంది. వీలైతే రోజులో కనీసం 15 నిమిషాలు మళ్లీ ఆ పనుల కోసం కేటాయించండి. ఎలాంటి లక్ష్యాలు పెట్టుకోకుండా, ఫలితం గురించి ఆలోచించకుండా చిన్నపిల్లల్లా మనస్ఫూర్తిగా ఆస్వాదించండి. బాల్యంలోని ఆ మధురమైన జ్ఞాపకాలను మళ్లీ అనుభూతి చెందండి. నమ్మండి.. ఆ చిన్నపాటి ఆనందం మీ మనసులోని ఒత్తిడిని తగ్గించి, రోజంతా కొత్త ఉత్సాహాన్ని నింపుతుంది.

-మహాదేవ

వింతల్లో వింతలు

రోడ్లపై మిరప కుప్పలు!



అమెరికాలోని ఫ్లోరిడా రాష్ట్రం ఫోర్ట్ మైయర్స్‌లో ఓ వింత ఘటన చోటుచేసుకుంది. పచ్చి మిరపకాయలను తరలిస్తున్న ఓ భారీ ట్రక్కు నుంచి ఏకంగా 19 ప్యాలెట్ల సరుకు రోడ్డుపై పడిపోయింది. ఒక్కో ప్యాలెట్‌లో సుమారు 600 పౌండ్ల మిరపకాయలు ఉండటంతో.. మొత్తం 11,400 పౌండ్ల సరుకు రహదారిపై చెల్లాచెదురుగా పడింది. దీంతో పామ్ బీచ్ బులేవార్డ్‌లోని రెండు లేన్లను అధికారులు మూసివేశారు. అదృష్టవశాత్తూ ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదు. రోడ్డును శుభ్రం చేసిన తర్వాత రాత్రి 10 గంటల సమయంలో ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. మిరపకాయలు మరోరోజు బతికి బయటపడ్డాయంటూ పోలీసులు చమత్కరించడం విశేషం.



మెగాస్టార్ విశ్వంభర.. అదొక్కటే బ్యాలెన్స్..!

మెగాస్టార్ ఫ్యాన్స్ ఎన్నో రోజులుగా ఎదురు చూస్తోన్న చిత్రాల్లో విశ్వంభర ఒకటి. ఇప్పటికే రిలీజ్ కావాల్సినా ఈ సినిమా పలు కారణాలతో వాయిదా పడుతూ వచ్చింది. ఇప్పటికీ ఈ సినిమా రిలీజ్ తేదీని ఇంకా ప్రకటించలేదు మేకర్స్. ఈ చిత్రానికి బింబిసార ఫేమ్ వశిష్ఠ దర్శకత్వం వహిస్తున్నారు. మరోవైపు మెగాస్టార్ అభిమానులు కాకా మూవీ కోసం వెయిట్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే విశ్వంభరకు సంబంధించి క్రేజీ టాక్ వినిపిస్తోంది. ఎట్టకేలకు ఈ సినిమా మళ్లీ ట్రాక్‌లోకి వచ్చినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం సినిమా ట్రైలర్ కట్ సహా డబ్బింగ్ వర్క్ శరవేగంగా జరుగుతోందని లేటెస్ట్ టాక్. ఇప్పటికే ట్రైలర్ కూడా సిద్ధమైనట్లు సమాచారం. మరోవైపు డబ్బింగ్ పనులు సైతం త్వరగా పూర్తి చేయాలని మేకర్స్ టార్గెట్‌గా పెట్టుకున్నారట. ఇదంతా చూస్తుంటే విశ్వంభర మూవీ త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుందని అర్థమవుతోంది. అయితే ఈ మూవీ రిలీజ్ తేదీని రివీల్ చేయాల్సి ఉంది. దీనిపై కూడా త్వరలోనే క్లారిటీ వచ్చేలా కనిపిస్తోంది. ఇదంతా చూస్తుంటే విశ్వంభరకు లైన్ క్లియర్ అయినట్లేనని మెగా ఫ్యాన్స్ భావిస్తున్నారు. ఇక రిలీజ్ తేదీనిఎప్పుడు రివీల్ చేస్తారో తెలియాల్సి ఉంది. కాగా.. ఈ చిత్రంలో త్రిష, ఆషిక రంగనాథ్ హీరోయిన్స్‌గా నటించారు. ఈ మూవీకి కీరవాణి, గౌర హరి సంగీతమదించగా.. ఈ చిత్రాన్ని యూవీ క్రియేషన్స్ బ్యానర్‌లో నిర్మించారు.

అది నాన్న-కూతురు బంధం..
మిస్కిన్ వివాదంపై స్పందించిన కీర్తి సురేష్!



చెన్నైలో జరిగిన 'సత్యవాన్ సావిత్రి' చిత్ర ప్రెస్ కాన్ఫరెన్స్‌లో దర్శకుడు మిస్కిన్ తనను ప్రశంసిస్తూ తొడ భాగం వైపు స్వల్పంగా తాకిన వీడియో వైరల్ అయిన నేపథ్యంలో నటి కీర్తి సురేష్ సోషల్ మీడియా వేదికగా ఘాటుగా స్పందించారు. ఈ వీడియోపై నెట్టింట పలువురు భిన్నంగా వ్యాఖ్యానించగా, ఒక యూజర్ ఆమె అసౌకర్యంగా ఉన్నట్లు కనిపించారని పేర్కొంటూ, సినిమాల్లో సన్నివేశాల కోసం తాకినప్పుడు బయట అలాంటి వాటికి ఎందుకు అంగీకరించరని ప్రశ్నించారు. దీనిపై సోషల్ మీడియా వేదికగా కీర్తి సురేష్ స్పందిస్తూ, తన ముఖంలో అసౌకర్యం ఎక్కడ కనిపించిందని ప్రశ్నించారు. తమ మధ్య తండ్రీకూతుళ్ల తరహా బంధం ఉందని తాము చెప్పిన మాటలు వినిపించలేదా అని నిలదీశారు. ఒకవేళ తాను అసౌకర్యంగా ఉన్నా, సినిమాల్లో తాకుతారు కాబట్టి బయట కూడా అలాగే ఉండాలని చెప్పడం సరికాదని హితవు పలికారు. కొన్ని విషయాలను సరిగ్గా అర్థం చేసుకోవాలని ఆ నెటిజన్‌కి చురకలంటించారు. కీర్తి సురేష్ స్పందన తర్వాత ఆ నెటిజన్ తన పోస్ట్‌ను తొలగించి, తనకు ఎలాంటి చెడు ఉద్దేశం లేదని క్షమాపణ కోరారు. మరోవైపు, ఈ వ్యవహారంలో ఎలాంటి అసౌకర్యం గానీ, దురుద్దేశం గానీ లేదని కీర్తి స్పష్టం చేశారని మరికొందరు నెటిజన్లు కూడా పేర్కొన్నారు.

బాక్సాఫీస్ వద్ద 'ఈఎన్ఈ రిపీట్' దూకుడు..
తొలి రోజే రూ.15 కోట్ల వసూళ్లు!

తరుణ్ భాస్కర్ దర్శకత్వంలో వచ్చిన 'ఈఎన్ఈ రిపీట్' బాక్సాఫీస్ దగ్గర తొలి రోజే మంచి వసూళ్లను రాబట్టింది. 2018లో వచ్చి కల్ట్ ఫ్యాన్ బేస్ సంపాదించుకున్న ఈ నగరానికి ఏమైంది సినిమాకు సీక్వెల్‌గా వచ్చిన ఈ చిత్రం, మొదటి రోజు ప్రపంచవ్యాప్తంగా రూ.15.27 కోట్లకు పైగా వసూళ్లు సాధించిందని మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. అంతేకాకుండా, తొలి రోజే పార్ట్-1 లైఫ్‌టైమ్ కలెక్షన్లను దాటేసిందని చిత్రబృందం తెలిపింది. తరుణ్ భాస్కర్ దర్శకత్వంలో వివేక్ సాగర్ సంగీతంతో వచ్చిన ఈ సినిమాను ఎస్ ఒరిజినల్స్, రూట్ నోడ్ సినిమా సంస్థలు నిర్మించాయి. విశ్వక్ సేన్, అభినవ్ గోమటం, శ్రీనాథ్ మాగంటి, వెంకటేష్ కాకుమాను, అనీషా అంబ్రోస్, శివాత్మిక రాజశేఖర్ ఈ గ్యాంగ్‌తో కలిసి మరోసారి సందడి చేశారు. మరోవైపు ఈ సినిమా పార్ట్1కి ఉన్న క్రేజ్ వలన ఓవర్సీస్‌లో కూడా దూసుకుపోతుంది.



తల్లిదండ్రులైన సమంత - రాజ్ నిడిమోరు..
కొడుకుకు 'దేవ్ నిడిమోరు' అని నామకరణం!



టాలీవుడ్ నటి సమంత రూత్ ప్రభు, రాజ్ నిడిమోరు తల్లిదండ్రులయ్యారు. ఈ జంటకు పండంటి మగబిడ్డ జన్మించగా, తమ చిన్నారికి 'దేవ్ నిడిమోరు' అని పేరు పెట్టినట్లు తెలుస్తోంది. ఇంటికి కొత్త సభ్యుడి రాకతో ఇరు కుటుంబాల్లో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సంతోషకర విషయాన్ని పంచుకుంటూ సమంత సోషల్ మీడియాలో ఒక ఎమోషనల్ ఫోటోను పోస్ట్ చేసింది. తమ ముద్దుల కొడుకు చిట్టి వేళ్లను పట్టుకుని ఉన్న ఆ చిత్రం నెటిజన్లను ఎంతగానో ఆకట్టుకుంటోంది. ఇక తల్లిదండ్రులుగా కొత్త బాధ్యతల్లోకి అడుగుపెట్టిన సమంత, రాజ్ నిడిమోరులకు సినీ పరిశ్రమలోని సహచరులు, స్నేహితులు, అభిమానులు పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలుపుతున్నారు. చిన్నారి దేవ్ నిడిమోరుకు ఆయురారోగ్యాలు, సకల సంతోషాలు కలగాలంటూ కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు.

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com